

# నేటిధాత్రి
తెలుగు వార్త పత్రిక

మీరు మన నేటిధాత్రిలో ఈ వార్తను వినడానికి, చదవడానికి క్యూఆర్‌ని స్కాన్ చేయ్యండి

బుధవారం 28-01-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 256 రూ॥ 6.00




# బీజేపీ వైఖరి విచిత్రం..
# అధికారంలోకి రావాలన్న సోయి శూన్యం!?











## •కాంగ్రెస్, బీజేపీ లు దేశంలో బద్ద శత్రువులు!
## •దశబ్దాలుగా రాజకీయాలలో భిన్న ధ్రువాలు?
## •తెలంగాణా లో మాత్రం బహిర్గత శత్రువులు.. అంతర్గత మిత్రులు?

- •తెలంగాణాలో కాంగ్రెస్, బీజేపీ విచిత్రమైన అనుబంధం?
- •రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై ఒక్కరు స్పందించరు?
- •నిత్యం బీఆర్ఎస్ ను నిందిస్తూనే వుంటారు?
- •గత ప్రభుత్వ పాలనపై దుమ్మెత్తి పోస్తూనే వుంటారు?
- •ఇంత వరకు ఆరు గ్యారెంటీల మీద అడిగిన బీజేపీ నాయకుడు లేడు?
- •రెండేళ్ల కాంగ్రెస్ పాలన మీద మాట్లాడిన వాళ్ళు లేరు?
- •తెలంగాణాలో వచ్చేది మేమే అంటారు... నాయకుల్లో సఖ్యత లేదు?
- •సర్పంచ్ ఎన్నికలలో కొన్ని గెలిచిందే ఎక్కువ అనుకుంటున్నారు?
- •రాష్ట్ర ప్రభుత్వం పనితీరును ప్రశ్నించరు?
- •కేంద్రం నుంచి నిధుల వరద తేలేరు?
- •ఒకప్పుడు ఉప్పల్ ఎమ్మెల్యేగా వున్న ప్రభాకర్ పాటి పని కూడా ఎంపిలు చేయడం లేదు?
- •ఇప్పుడు ఎనమిది మంది ఎమ్మెల్యే లు, ఎనమిది మంది ఎంపీలున్నారు?
- •ప్రభాకర్ లాగా నిధులు తెచ్చిన వారు ఒక్కరు లేరు?
- •ఇదినా ఘనత అని చెప్పుకునేందుకు ఏమిలేదు?
- •ప్రసిడెంట్ గా అర్హత మాత్రం మాదే అని అందరూ అంటారు?
- •పార్టీ ని బలోపేతం చేయడానికి కంకణం కట్టుకునే వారు లేరు?
- •రాష్ట్ర ప్రభుత్వాన్ని పల్లెతు మాట అనలేరు?
- •మున్సిపాలిటీ ఎన్నికల ముందు కూడా సమాలోచనలు లేవు?

హైదరాబాద్, నేటిధాత్రి:

పేరు పెద్ద ఊరు దిబ్బ అంటే ఇదే! ఆ పార్టీలో అందరూ ఉద్దండులే. రాజకీయ అనుభవంలో అందరూ కింగ్‌లే. పార్టీ బరువు మోయాలని అందరూ చూస్తున్నవారే. కాని పార్టీ బలోపేతానికి అందరూ చేతులేత్తేసేవారే? ఈ మాట అంటున్నది ఎవరో కాదు? సాక్ష్యాత్తు పార్టీ నాయకులు, కార్యకర్తలు. తెలంగాణలో బిజేపి బలోపేతం కావాలని పార్టీ నాయకులు, కార్యకర్తలు కోరుకుంటున్నారు. పార్టీ వైపు నిలిచేందుకు ప్రజలు కూడా ఎంతో కొంత అనుకూలంగానే వున్నారు. అందుకే గత ఎన్నికల్లో అసెంబ్లీకి ఎన్నడూ లేని విదంగా ఎనమిది మంది ఎమ్మెల్యేలను గెలిపించారు. పార్లమెంటు ఎన్నికల్లో ఎనమిది మంది ఎంపిలను గెలిపించారు. దాంతో ఇక తెలంగాణలో బిజేపికి మంచి రోజులు వచ్చినట్లే అని అందరూ అనుకున్నారు. పార్టీ ఇక గాడిలో పడినట్లే అని సంతోషపడ్డారు. ఎనమిది మందిఎంపిలు గెలిచినందుకు పార్టీ కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. కాని ఏమైంది? ఏమౌతోంది? పార్టీ ఎటు పోతోంది? నాయకులు ఏం చేస్తున్నారు? గెలిచిన వారు ఏ రాజకీయాలు చేస్తున్నారు? ఉమ్మడి రాష్టంలో ఏదో ఒక పార్టీతో పొత్తు పెట్టుకున్నా రానన్ని సీట్లు ఇప్పుడు బిజేపి వచ్చాయి. బిజేపిఅంటే ప్రజల్లో గతం కన్నా సానుకూలమైన వాతావరణం ఏర్పడినట్లే అనుకున్నారు. కార్యకర్తలు అనుకున్నదొక్కటి..జరుగుతున్నదొక్కటి!! కార్యకర్తల మనోభావాలకు అనుగుణంగా రాష్ట్ర బిజేపి నాయకులు ఎందుకు కదలడం లేదు? పై నుంచి వున్న ఆదేశాలా? లేక రాష్ట్ర నాయకుల ఆలోచనలా? అన్నది కూడా తేలాల్సి వుంది. సొంత పార్టీ కార్యకర్తలే గందరగోళంలో వున్నారంటే ప్రజలు ఎలా నమ్ముతారు? ఎలా విశ్వసిస్తారు? ఎలా ఓట్లేసి గెలిపించుకుంటారు? ప్రజలకు బిజేపి పార్టీ కావాలనుకుంటే గెలిపించుకుంటారు? అని అనుకుంటున్నారా? రెండేళ్ల కాలంలో చేస్తున్న రాజకీయం ఏమిటి? బలోపేతం కోసం తీసుకున్న నిర్ణయాలేమిటి? అనేది ఎవరూ చెప్పలేరు. పైగా రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ మీద ఈగ వాలకుండా రక్షణగా వుంటున్నారన్న రాజకీయ విమర్శలకు కూడా సమాధానం చెప్పేవారు లేరు. తెలంగాణలో బిజేపి బలహీన పడడడం వల్ల అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ పుంజుకున్నది. అధికారంలోకి వచ్చింది. ఎప్పుడైతే బండి సంజయ్‌ని పక్కన పెట్టారో అప్పుడే పార్టీ మీద ప్రజల్లో కూడా అసహనం ఏర్పడింది. కార్యకర్తలో నిస్తేజం ఆవహించింది. అయినా సరే ప్రజలు కోరుకున్న ప్రాంతాల్లోఎమ్మెల్యేలు గెలిచారు. ఎంపిలు కూడా గెలిచారు. ఇంకా ప్రజలు ఎలాంటి సంకేతాలివ్వాలని అనుకుంటున్నారు. సహజంగా ప్రతిపక్ష పార్టీ అనేది పాలకపక్షం మీద యుద్ధం చేయాలి. కాని తెలంగాణలో రివర్స్ రాజకీయం సాగుతోంది. ఇంకా బిఆర్ఎస్ పార్టీయే అధికారంలో వున్నట్లు బిజేపి నాయకులు వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయ్యింది. రైతులకు సక్రమంగా రైతు భరోసా ఇవ్వడం లేదు. ఎన్నికల ముందు చెప్పిన వాగ్ధానాలు ఏవీ అమలు చేయడం లేదు. ఒక్క ఆర్టీసిలో మహిళలకు ఉచిత ప్రయాణం మాత్రమే పర్‌ఫెక్టుగా అమలు జరుగుతోంది. సిలిండర్ రూ.500 అమలు జరుగుతుందనంటున్నారు. అది ఎంత మందికి వస్తుందనేది ఎవరికీ అర్దం కావడం లేదు. ఇక రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్ కూడా కొంత వరకు బాగానే అమలు జరుగుతోంది. ఇక మిగతా పథకాల అమలు గాలిలో చక్కర్లు కొడుతున్నాయి. ఈ ఐదేళ్ల కాలంలో అందుతాయా? లేదా? అన్నది ఎవరికీ అర్దంకాకుండా వుంది. ఇందిరమ్మ ఇండ్లు కొంత సాగుతున్నాయి. ఇక మిగతా వాగ్దానాలు అమలుకు నోచుకోవడం లేదు. రైతు భరోసా రూ.15000 ఇస్తామన్నారు. ఆఖరుకు రూ.12000 ఇస్తామన్నారు. కాని రెండేళ్లలో కేవలం రెండు విడతలు మాత్రమే అందాయి. మిగతా రెండు విడతలు అందలేదు. మూడో ఏడాది తొలి విడతకు మోక్షం రావడం లేదు. వాటిని గురించి బిజేపి ఎందుకు ప్రస్తావించడం లేదో అర్ధం కావడంలేదు. అదే సందర్భంలో మోడీ కిసాన్ పథకం సక్రమంగా సకాలంలో అమలు జరుగుతోంది. ఇక్కడ ఎందుకు జరగడం లేదన్నది ఎందుకు ప్రశ్నించడం లేదు. వయసు మళ్లిన వారికి గత ప్రభుత్వం నుంచి అందుతున్న పించన్ల పెంపు ముచ్చటే లేదు. అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్దులకు అందుతున్న పించన్లు వెంటనే పెంచుతామన్నారు. నెల నెల రూ.4000 ఇస్తామన్నారు. దాని అమలు కూడా నోచుకోలేదు. కళ్యాణ లక్ష్మి లక్ష రూపాయలతోపాటు, తులం బంగారం ఇస్తామన్నారు. తులం జాడ లేదు. ఇచ్చే పరిస్దితి కనిపించడంలేదు. తెలంగాణలో వున్న ప్రతి మహిళకు రూ.2500 నెల నెల ఇస్తామన్నారు. అది కూడా పరిశీలనలోనే లేదు. 18 సంవత్సరాలు నిండిన చదువుకునే ప్రతి అమ్మాయికి ఉచితంగా స్కూటీ ఇస్తామన్నారు. అదీ గతి లేదు. విద్యార్దులకు రూ.5 లక్షల కార్డు ఇస్తామన్నారు. అదీ ముందట పడింది లేదు. ఇన్ని వైపల్యాలు కంటి మందుకు కనిపిస్తున్నా బిజేపి నాయకులు చూడడం లేదు. ప్రభుత్వాన్ని అడగడం లేదు. నిలదీయడంలేదు. ఉద్యమాలు చేయడం లేదు. పోరాటాల ముచ్చట అసలే లేదు. కాని గత పాలన మీదనే ఇంకా ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వాన్ని దగ్గరుండి బిజేపి నాయకులు రక్షిస్తున్నారన్న అభిప్రాయం వ్యక్తమౌతోంది. తాజాగా నైనీ బొగ్గు గనుల కేటాయింపులపై చర్చోపచర్చలు జరుగుతున్నాయి. రచ్చ రచ్చ జరగుతోంది. బిజేపి నాయకులు కనిపించడం లేదు. వినిపించడం లేదు. అసలు ఆ సంగతే వారు పట్టించుకోవడం లేదు. కేంద్రం స్పందించాలని కోరుతూ మాజీ మంత్రి హరీష్‌రావు కేంద్రానికి ఉత్తరం కూడా రాశారు. సిబిఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం నుంచి ఉలుకు పలుకులేదు. బిజేపి నాయకుల స్పందనే లేదు. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పందన విచిత్రంగా వుందంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నైనీ బ్లాక్ విషయంలో ఉత్తరం రాస్తే తాము రంగంలోకి దిగుతామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నుంచి వింత సమాదానం వస్తుందని ఎవరూ ఊహించలేదు. సాక్ష్యాత్తు పిసిసి. ప్రెసిడెంటు సవాలు చేసినా కేంద్ర మంత్రి ఉలుకు లేదు..పలుకు లేదు? సరే రాజకీయాలపై కాకుండా అభివృద్ది మీద ఏదైనా దృష్టిపెడుతున్నారా? అంటే అదీ లేదు. 2014 ఎన్నికల్లో ఉప్పల్ ఎమ్మెల్యేగా పనిచేసిన ఎన్‌విఎస్‌ఎస్ ప్రభాకర్ లాంటి నాయకులు బిజేపి లేరా? అనే ప్రశ్న ఉత్పన్నమౌతోంది. ఆయన ఎమ్మెల్యేగా వున్న సమయంలో కేంద్రం నుంచి నిధులు తెచ్చారు. రూ.1750 కోట్ల రూపాయల విలువైన ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టును సాదించారు. అందుకోసం ఆయన అనేక సార్లు డిల్లీ వెళ్లారు. కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరిని పలుసార్లు కలిశారు. మొత్తానికి ఎలివేటెడ్ కారిడార్‌ను సాధించారు. దాని కోసం ఆయన పడిన శ్రమ అంతా ఇంతా కాదు. అదే రకంగా తన నియోజకవర్గ పరిధిలో వున్న చర్లపల్లి రైల్వేస్టేషన్ అభివృద్ది కోసం ఎంతో ప్రయత్నం చేశారు. అలా చేసిన ప్రయత్నంలో ఏకంగా చర్లపల్లిని స్టేషన్‌ను టెర్మినల్‌గా చేసేలా కృషి చేశారు. యాదాద్రి వరకు ఎంఎంటిఎస్ పొడిగించాలని అనేక విజ్ఞప్తులు చేశారు. మూడో లైన్ కావాలని కోరారు. ఇలా ఆయన పట్టుపట్టి అనేక ప్రాజెక్టులు తీసుకొచ్చారు. అలాంటి నాయకుడిని జనం ఓడించారు. పార్టీ కూడా ఆయన సేవలను పట్టించుకోవడం మానేసింది. ఇప్పుడు ఎనమిది మంది ఎమ్మెల్యేలున్నారు. ఏ ఒక్క ఎమ్మెల్యే తన నియోజకవర్గ అభివృద్ది కోసం డిల్లీ గడప తొక్కిందిలేదు. కేంద్ర మంత్రులను కలిసింది లేరు. అర్జీలు ఇచ్చింది లేదు. ప్రాజెక్టులు సాదించింది లేదు. అలాగే ఎనమిది మంది ఎంపిలున్నారు. కాని వాళ్లు కూడా తాము ఫలాన ప్రాజెక్టును తెచ్చామని చెప్పుకోవడానికి ఏదీ లేదు. తెలంగాణ అంటేనే నీటి సమస్య. ఒకప్పటి పరిస్దితి ఇప్పుడు లేదు. కాని ఇంకా కొన్ని పెండింగ్ ప్రాజెక్టులున్నాయి. వాటి కోసం ప్రయత్నం చేస్తున్న వారు లేరు. వారికి ఆ సోయి కూడా లేదు. పార్టీలో లుకలుకలు తప్ప మరేం కనిపించడం లేదు. బిఆర్ఎస్ నుంచి ప్రభుత్వం మీదకు విమర్శలు వచ్చినప్పుడు మాత్రం బిజేపి నాయకులు వెంటనే స్పందిస్తారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఈగ వాలకుండా చేస్తుంటారు. దేశంలో కొన్ని దశాబ్ధాలుగా బద్దశత్రువైన కాంగ్రెస్‌తో తెలంగాణలో ఈ అంతర్గత రహస్య స్నేహమేమిటో ఎవరికీ అర్ధం కాదు!!






# నేటిధాత్రి
తెలుగు వార్త పత్రిక



## న్యాయవాదులకు ఆహ్వానం

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలలో 21 సంవత్సరాల అనుభవం కలిగిన “నేటిధాత్రి” పత్రికలో “లీగల్ టీం” లో చేరడానికి జిల్లాల వారీగా ఐదు సంవత్సరాల అనుభవం కలిగిన ఆశావాహులైన న్యాయవాదులకు ఆహ్వానం.

ఆసక్తి కలిగిన న్యాయవాదులు బయోడేటాను కింది నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించగలరు.

“నేటిధాత్రి” కార్యాలయము. రోడ్ నెం. 3, బంజరహిల్స్,హైదరాబాద్
9908658888, 9989138678, 6281849354



బుధవారం 28-01-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 256 రూ॥ 6.00








చీఫ్ ఎడిటర్
కట్టా రాఘవేందర్ రావ్
9063524136, 9908658888


# తెలుగు రాష్ట్రాల మధ్య కొరుకుపడని

# సమస్యగా పోలవరం ప్రాజెక్టు

## పోలవరం నల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టుపై రగిలిన వివాదం

- తెలంగాణ, కేంద్ర నిపుణుల అభ్యంతరాలతో టెండర్లు నిలిపివేత
- ఏపీ ప్రాజెక్టును విస్తరిస్తోందని సుప్రీంకోర్టును ఆశ్రయించిన తెలంగాణ
- పిటిషన్ కొట్టివేస్తూ, సివిల్ దావా వేయడానికి కోర్టు అనుమతి
- పరస్పర చర్చలు, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని సూచన
- విపక్షాల విమర్శల దాడుల్లో ‘తెలుగు’ ప్రభుత్వాలు ఉక్కిరిబిక్కిరి
- భావోద్వేగాలు ముడిపడి వుండటమే కారణం
- నత్తనడకన ప్రాజెక్టు నిర్మాణం
- ఎప్పటికి పూర్తవుతుందో తెలియని వైనం
- వచ్చే గోదావరి పుష్కరాలకు పూర్తిచేయాలన్నది ప్రభుత్వ సంకల్పం

## క్షేత్రస్థాయి పరిస్థితులు అందుకు భిన్నం

హైదరాబాద్, నేటిధాత్రి:

ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి నదిపై నిర్మించిన పోలవరం ప్రాజెక్టు రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కొరుకుడుపడని సమస్యగా మారింది. నీటిపంపిణీ, పర్యావరణ అనుమతులు, ముంపు గ్రామా లు, లక్షల సంఖ్యలో ప్రజల పునరావాసం వంటి సమస్యలు ఈ ప్రాజెక్టును ముందుకు కదలనీ యడంలేదు. వీటికితోడు రెండు రాష్ట్రాల మధ్య ఇదొక రాజకీయ సమస్యగా మారడంతో రాచ పుండు మాదిరి రేగుతోంది తప్ప పరిష్కారం కనిపించడంలేదు. ఆంధ్రప్రదేశ్‌కు నీటిసరఫరా పరంగా భద్రత కలిగించే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని 2004లో ప్రారంభించారు. దీన్ని అధికారికంగా జాతీయ ప్రాజెక్టుగా పరిగణించినప్పటికీ ప్రాజెక్టు నిర్మాణం మొత్తం ఆంధ్రప్రదేశ్ ప్ర భుత్వమే చూసుకుంటుంది. 2014, ఏప్రిల్ 1 నుంచి నీటిపారుదలకు సంబంధించిన మొత్తం ఖర్చును కేంద్రమే భరిస్తుంది. ప్రాజెక్టు అనుమతులు ఇచ్చే బాధ్యత కూడా దానిదే. మొత్తం మీద ప్రాజెక్టుపై నియంత్రన కేంద్రానిదే. కేంద్ర జల్‌శక్తి మంత్రిత్వశాఖ ఆధీనంలో వుండే ‘పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) ప్రాజెక్టు నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటుంది. అయితే ఈ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ వల్ల ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో కొన్ని ప్రాంతాలు ముంపునకు గు రవుతాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలను సమన్వయం చేసి తగిన పరిష్కారాలను కూడా కనుగొనే బాధ్యత కేంద్రానిదే.

పోలవరం ప్రాజెక్టు ప్రారంభం నుంచి అనేక అడ్డంకులు, వివాదాలు చుట్టుముట్టడంతో, నిర్మాణ పనులు నత్తకు అన్న రీతిలో కొనసాగుతున్నాయి. ఎప్పటికప్పుడు లక్ష్యాలు నిర్దేశించుకున్నా, వివాదాల కారణంగా ముందుకు పోలేని దుస్థితి నెలకొంది. రూ.8261 కోట్ల నుంచి రూ.10151.04 కోట్ల మధ్య అంచనాతో 2004లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు విపరీతమైన జాప్యాలు, డిజైన్లలో మార్పులు చేర్పుల కారణంగా 2026 జనవరి నాటికి ప్రాజెక్టు వ్యయం ఏకంగా రూ.62436 కోట్లకు పెరిగింది. ఇప్పటి తెలుగుదేశం ప్రభుత్వం ప్రాజెక్టును 2027కు పూర్తిచేయాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నప్పటికీ, 2029 దాకా నెట్టుకుపోయే అవకాశాలే ఎక్కువ. 2014, ఏప్రిల్ 1 నుంచి 2023 ఆగస్టు వరకు కేంద్రం ఈ ప్రాజెక్టు నిమిత్తం రూ.13,463 కోట్లకు పైగా చెల్లిం చింది. ప్రాజెక్టు డయాఫ్రం వాల్ దెబ్బతినడంతో, మరమ్మతులతో పాటు దీన్ని పూర్తి చేయడానికి రూ.993 కోట్లు ఖర్చు కాగలదని అంచనా. ఇక ప్రాజెక్టు పురోగతి విషయానికి వస్తే 2025 ఏ ప్రిల్ నాటికి 55.90% పనులు పూర్తయ్యాయి. పునరావాస పనులు కొనసాగుతున్నాయి. ప్రస్తు తం డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు 75-78% వరకు పూర్తయ్యాయి. 2027 గోదావరి పుష్కరాలకు ముందే ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని చంద్రబాబు ప్రభుత్వం పట్టుదలతో వుంది.

పోలవరరానల్లమలసాగర్ లింక్ ప్రాజెక్టు పేరుతో (మొదట్లో బనకచర్ల లింక్) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును మరింత విస్తరించాలని చూస్తున్నదని, ఇది ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టాన్ని ఉల్లంఘించడమేనని, అదీకాకుండా ఇందుకు సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) అనుమతులు లేవంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసింది. ఈ విస్తరణ వల్ల పెరిగే బ్యాక్ వాటర్ కారణంగా భద్రాచలం పట్టణం, మణుగూరు హెవీవాటర్ ప్లాంట్ ముంపునకు గురవుతాయని తెలంగాణ ప్రభుత్వం భయపడుతోంది. అయితే అవసరమైన అన్ని అనుమతులు తీసుకొని ఈ ప్రాజెక్టు పనులు చేపట్టామని, ఇది ఆంధ్రప్రాంత అభివృద్ధికి చాలా అవసర మని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెబుతోంది. తెలంగాణ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగంలోని 32వ అధికరణ కింద ఈ కేసును విచారించడం సాధ్యం కాదని, ఇందులో అంతర్‌రాష్ట్ర వివాదాలు, కేంద్రం కూడా ఇమిడి వున్నందువల్ల 131వ అధికరణ కింద సివిల్ దావాగా మార్పు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు మళ్లీ దావా వేసేందుకు తెలంగాణకు అనుమతించింది. అయితే రెండు రాష్ట్రాలు పరస్పర చర్చలు, మధ్యవర్తిత్వం ద్వారా దీన్ని పరిష్కరించుకోవచ్చునని కూడా సూచించింది. కేవలం 80 టీఎంసీ నీటిని వాడుకోవడానికి పరిమితం కాకుండా 200 టీఎంసీల గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు తరలించడానికి ఆంధ్రప్రదేశ్ యత్నిస్తున్నదనేది తెలంగాణ ప్రధానంగా వాదిస్తోంది. బ్యాక్ వాటర్, పునరావాస సమస్యలను తెలంగాణతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గడ్ కూడా లేవనెత్తుతోంది. కేంద్రప్రభుత్వ ఆధీనంలోని పీపీఏ ప్రాజెక్టును పర్యవేక్షిస్తున్నప్పటికీ స్వతంత్ర అధ్యయనం కోసం డిమాండ్ చేస్తున్నాయి.

ఈ పరిణామాల నేపథ్యంలో నీటివివాదాలను సామరస్య ధోరణిలో పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. సముద్రంలోకి వెళ్లే గోదావరి మిగులు జలాలను ఉపయోగించుకోవడం రెండు రాష్ట్రాలకు ప్రయోజనకరమన్నారు. సమస్య పరిష్కారానికి ఆయన కొన్ని సూచనలు చేశారు. జలవివాదాలను రాజకీయ ఘర్షణలుగామార్చకూడదు. పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టును సమర్థిస్తూ, తెలంగాణ వాదనలో అర్థం లేదన్నారు. ఎందుకంటే ఇది మిగులు జలాలకు ఉద్దేశించింది. తెలంగాణకు ఎటువంటి హాని కలిగించదని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పూర్తయిన తర్వాత తెలంగాణకు కూడా నీటి సరఫరా చేయవచ్చునన్నారు. అందువల్ల పొరుగు రాష్ట్రం దీని విషయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించకుండా వుండాలన్నారు.

అయితే పరస్పర అంగీకారం లేకుండా నీటి తరలింపునకు పాల్పడటం తప్పని తెలంగాణ వాదించడమే కాకుండా సుప్రీంకోర్టులో కేసు దాఖలు చేసింది. ఇందుకు కోర్టు మధ్యవర్తిత్వ పరిష్కారా న్ని సూచిస్తూ, కేసు కొట్టివేసింది. ఇదిలావుండగా గోదావరి నదీ నిర్వహణ బోర్డు (జీఆర్ఎంబీ), పోలవరం ప్రాజెక్టు అథారిటీ, కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖతో సహా అన్ని వేదికలపై తెలంగాణ ఈ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఇది 1980 గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ అవా ర్డును ఉల్లంఘించడమేనని స్పష్టం చేస్తోంది. భద్రాచలం పట్టణం ముంపునకు గురయ్యే ప్రమా దం వుందన్న భయంతో దీనిపై అధ్యయనానికి ఆదేశించింది. తెలంగాణ నీటిహక్కులను కాపాడుకునేందుకు అన్ని రాజకీయ పక్షాలు ఏకం కావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అయితే మొదట్లో తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు విషయమై చర్చల్లో పాల్గన్నప్పటికీ, రాష్ట్ర వైఖరిని బలహీన పరచే విధంగా వ్యవహరించిందని, ఆ తర్వాత మాత్రమే కఠిన వైఖరిను అనుస రించిందంటూ విపక్షాలు ప్రభుత్వాన్ని విమర్శించాయి.

రెండు రాష్ట్రాల మధ్య ఒక పక్క జలవివాదం రగులుతుండగానే, ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు ప్రతిపక్షాలు, గిరిజన సంస్థలు, పొరుగు రాష్ట్రాలనుంచి బహుముఖ ఒత్తిళ్లను ఎదుర్కొంటుండటంవర్తమాన చరిత్ర. ఈ ఒత్తిళ్లు ప్రధానంగా పునరావాసం, నిర్మాణంలో నిర్లక్ష్యం, పర్యావరణ వి ధ్వంసం, అంతర్‌రాష్ట్ర జల వివాదాలు వంటివి రెండు రాష్ట్ర ప్రభుత్వాలను ఊపిరి సలపనీయడం లేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రధాన ప్రతిపక్షమైన వైసీపీ నుంచి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నది. 2014-19 మధ్యకాలంలో డయాఫ్రం గోడ దెబ్బతిన్నదని, దీన్ని బాగు చేయడానికి అవసరానికి మించి విపరీతంగా ఖర్చు చేశారన్నది (రూ.900కోట్లు) వైసీపీ ప్రధాన అభియోగం. 2027 నాటికి పూర్తి చేస్తామన్న ప్రభుత్వ మాటలను వైసీపీ విశ్వసించడంలేదు. గతంలో ఇటువంటి గడువులు చాలా దాటిపోయాయన్న సంగతిని గుర్తుచేస్తున్నది. కాగా ఇప్పటికీ వేలాది గిరిజన కుటుంబాలకు పునరావాస సదుపాయాలు కల్పించలేదని గిరిజన సంస్థలు, ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తు న్నాయి. ఇక ఏపీ ప్రభుత్వం రూపొందించిన పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు తీవ్ర విమర్శలుఎదుర్కొంటున్నది. ముఖ్యంగా ఈ ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలు, చట్టపరమైన స్థితిపై తెలంగాణ కేం ద్ర నిపుణుల కమిటీలు అభ్యంతరాలు లేవనెత్తడంతో ఈ ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లను తెలుగుదేశం ప్రభుత్వం రద్దుచేసింది. రాష్ట్రంలో తరచుగా అధికార మార్పిడులు జరగడం, తొందరపాటులో ఒప్పందాలను (ఉదాహరణకు నవయుగ ఇంజనీరింగ్‌ను రద్దు చేయడం) రద్దు చేస్తూ నిర్ణయాలు తీసుకోవడం, మొదటిసారి టీడీపీ పాలనలో రూ.2400 కోట్ల బిల్లులు చెల్లింపులో కూడా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు రావడం వంటి పాలనా పరమైన అడ్డంకులు ప్రాజెక్టును జాప్యం చేశాయి. వీటికితోడు కేంద్రం నిధుల చెల్లింపులో జాప్యం, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనుల్లో ఆలస్యం వెరిసి కర్ణుడి చావుకు ఆరు కారణాలన్నట్టు పోలవరం ప్రాజెక్టు ఆలస్యమవు తోంది.

ఇక తెలంగాణ ప్రభుత్వం, ప్రతిపక్ష బీఆర్ ఎస్ నుంచి తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నది. ము ఖ్యంగా భద్రాచలం పట్టణం, మణుగూరు హెవీ వాటర్ ప్లాంట్ మునక విషయంలో కచ్చితంగా వ్యవహరించాలని అధికార కాంగ్రెస్‌ను డిమాండ్ చేస్తోంది. విపక్షాల వత్తిడి తట్టుకోలేక రేవంత్ ప్రభుత్వం ఏపీ చేస్తున్న అనధికార పనులపై సుప్రీంకోర్టును ఆశ్రయించగా, కేసును కోర్టు కొట్టేసింది. చివరకు 131వ అధికరణ కింద సివిల్ దావా వేసేందుకు కోర్టు అనుమతించింది.అయితే ఏపీ ప్రభుత్వ చర్యలపై రేవంత్ ప్రభుత్వం వేగంగా స్పందించడంలేదని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. ఒడిశా, ఛత్తీస్‌గడ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన విపక్షాల జాయింట్ యాక్షన్ కమిటీ, బ్యాక్‌వాటర్ ముంపుపై పూర్తి అధ్యయనం చేయకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడానికి వీల్లేదనిడిమాండ్ చేసింది. మరో ప్రధాన అంశమేంటంటే, పాపికొండల జాతీయ పార్క్ ఈ ప్రాజెక్టు వల్ల పూర్తిగా దెబ్బతింటుందనేది పర్యావరణ ప్రేమికుల వాదన.


## “నేటిధాత్రి” 21వ వసంతపు తోరణం



మీ
కట్టా శివ సుబ్రహ్మణ్యం
సీఈఓ, నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

చరిత్రను చెప్పాలన్నా, ఆ చరిత్రను నిక్షిప్తం చేయాలన్నా కావాల్సింది “అక్షరం”

“నేటిధాత్రి” అక్షర ప్రయాణంలో “20 మైలు రాళ్ళు” దాటుకొని ముందుకు సాగుతూ, తెలుగు రాష్ట్రాల గుండెను నింపుకొని, తడి ఆరని అక్షరాలు మోసుకుంటూ పత్రికా ప్రయాణం సాగిస్తూ “21 వ వసంతం” లోకి దిగ్విజయంగా అడుగిడుతుందని సగర్వంగా చెబుతున్నాము.

“నేటిధాత్రి” అక్షర ప్రయాణంలో మీరు ఇప్పటివరకు అందించిన, అందిస్తున్న సహాయ, సహకారాలు మునుముందు కూడా ఇలాగే కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ....



మీ
కట్టా రాఘవేందర్ రావ్
సీఈఓ, నేటిధాత్రి దినపత్రిక
9908658888, 8297779999




నిష్పక్షపాత వార్తల నిజరూపం

# నేటిధాత్రి

తెలుగు వార్తా పత్రిక



## న్యాయవాదులకు ఆహ్వానం

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలలో 21 సంవత్సరాల అనుభవం కలిగిన "నేటిధాత్రి" పత్రికలో "లీగల్ టీం" లో చేరడానికి జిల్లాల వారీగా ఐదు సంవత్సరాల అనుభవం కలిగిన ఆశావాహులైన న్యాయవాదులకు ఆహ్వానం.

ఆసక్తి కలిగిన న్యాయవాదులు బయోడేటాను కింది నెంబర్లకు వాట్స్‌అప్ ద్వారా పంపించగలరు.

"నేటిధాత్రి" కార్యాలయము. రోడ్ నెం. 3, బంజరహిల్స్,హైదరాబాద్

9908658888, 9989138678, 6281849354



బుధవారం 28-01-2026 పేజీలు : 12 | CIRCULATED AT : TELANGANA and ANDHRAPRADESH STATES | సంపుటి : 21 సంచిక : 256 రూ॥ 6.00




## మేడారం వచ్చే భక్తుల కోసం రూట్ మ్యాప్

వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం పోలీసుల గైడ్

ములుగు, నేటిధాత్రి:
ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈ

04 లో



## వాహనాల ట్రాఫిక్ అతిపెద్ద సమస్య

- విధించిన రూల్స్‌లోనే వెళ్లేలా చర్యలు
- రోడ్డు పక్కన వాహనాల నిలుపుదల నిషేధం
- వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

04 లో



## మున్సిపల్ ఎన్నికల హడావిడి

- పనిలోపనిగా అక్రమార్కుల ఇసుకదోపిడీ
- అధికారులు పట్టించుకోవడం లేదంటున్న ప్రజలు

నిజామాబాద్, నేటిధాత్రి:
భీమ్‌గల్ మండలంలో ఇసుక దందాకు అడ్డూ

04 లో

## వరంగల్ నగరంలో ఘోర రోడ్డు ప్రమాదం

- టూ వీలర్‌ను వేగంగా ఢీకొన్న టిప్పర్
- ప్రమాదంలో నిండు గర్భిణిగా ఉన్న డాక్టర్ మృతి



వరంగల్, నేటిధాత్రి:
వరంగల్ నగరంలో విషాద ఘటన చోటుచేసుకుంది. రోడ్డు ప్రమాదంలో నిండు గర్భిణిగా ఉన్న వైద్యురాలు మృతిచెందారు. మట్టెవాడ ఎస్సై శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని గుల్బర్గా జిల్లా చించోలి మండలం బత్తంపల్లికి చెందిన ఎస్.మమతారాణి వైద్యురాలిగా పనిచేస్తున్నారు. నగరంలోని హంటర్ రోడ్డులోని ఫాదర్ కొలంబో ఆస్పత్రిలో జనరల్ మెడిసిన్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్నారు. గతేడాది నారాయణపేట జిల్లాకు చెందిన డాక్టర్ రాఘవేంద్రతో ఆమెకు వివాహం జరిగింది. సోమవారం రాత్రి విధులు ముగించుకొని భర్తతో కలిసి హంటర్ రోడ్డు మీదుగా బైక్‌పై ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యలో ఏడు మోరీల కూడలి వద్దకు రాగానే వెనక నుంచి వచ్చిన టిప్పర్ వారి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో భార్యాభర్తలు కింద పడిపోయారు. 9 నెలల గర్భిణిగా ఉన్న మమతా రాణి తీవ్రంగా గాయపడటంతో స్థానికుల సహాయంతో భర్త నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందారు. టిప్పర్ డ్రైవర్ అన్సారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిని ఝార్ఖండ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# మోగిన తెలంగాణ మున్సిపల్ ఎన్నికల నగారా

- ఫిబ్రవరి 11న పోలింగ్... 12 అవసరమైతే రీపోలింగ్
- ఫిబ్రవరి 13న కౌంటింగ్ ..అదేరోజు ఫలితం వెల్లడి
- 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎంపిక
- నేటినుంచే నామినేషన్ల స్వీకరణ..30 వరకు గడువు
- 31న నామినేషన్ల పరిశీలన... ఫిబ్రవరి 3 వరకు ఉపసంహరణ
- వెంటనే అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్
- షెడ్యూల్ ప్రకటించిన కమిషనర్ రాణి కుముదిని







హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి 2026 సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది. ఈ ఎన్నికల పక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్ఈసీ రాణికుముదిని ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ మేరకు 28 నుంచి నామినేషన్ల పక్రియ ప్రారంభం అవుఉతంది.

30తో నామినేషన్ల స్వీకరణ గడవు ముగియనున్నది. 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత పొందిన వారి జాబితా ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగ,ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేపడతారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు.

# ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం

- రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు
- కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- పఠాన్‌చెరువులో ఇంటిగ్రేటెడ్ భవనానికి నేడు శంకుస్థాపన
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



హైదరాబాద్, నేటిధాత్రి:
తెలంగాణ ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత పదేళ్లలో ఆనాటి పాలకుల స్వార్థపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. గడచిన రెండేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు, సూచనల మేరకు భ్రష్టుపట్టిన వ్యవస్థను సంస్కరిస్తూ రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుపై మంగళవారం నాడు సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ .. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్‌లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని నిర్మాణంతో పాటు ఐదు సంవత్సరాల నిర్వహణాబాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని తెలిపారు. మూడు నుంచి ఐదు ఎకరాల స్థలంలో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజీ హాల్, గర్భిణీలకు, వృద్దులకు ప్రత్యేక వసతులు, విశాలమైన వెయిటింగ్ ఏరియా మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నపిల్లల కోసం క్రెచ్, వృద్దులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం తదితరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మిగిలిన కార్యాలయాలకు శంకుస్థాపనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండవ విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తామని ఇందుకు అవసరమైన కార్యాచరణను సిద్దం చేయాలని సూచించారు. ఇప్పటికే తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని జూన్ 2వ తేదీ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల మేడ్చల్ జిల్లాలో భవనానికి శంకుస్థాపన చేయడం జరిగిందని పఠాన్ చెరువు-శంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో రాజపుష్ప కన్‌స్ట్రక్షన్ నిర్మించే ఇంటిగ్రేటెడ్ భవనానికి బుధవారం నాడు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, ఈ ఆధార్ సంతకం వంటి సౌకర్యాలతో ప్రజల సమయాన్ని ఎంతో ఆదా చేశామని అన్నారు. రెవెన్యూ శాఖలో తీసుకుంటున్న ఈ సంస్కరణలు కేవలం కార్యాలయాల మార్పు మాత్రమే కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సంస్కరణలుగా నిలుస్తాయని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## రిజిస్ట్రేషన్ కార్యాలయం తరలింపు కుదరదు

- మంత్రులతో మాట్లాడే వరకు నిర్ణయం తీసుకోవద్దు
- అధికారులను హెచ్చరించిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి





సంగారెడ్డి, నేటిధాత్రి:
సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మరో చోటికి తరలిస్తే ఊరుకోనని కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా, పట్టణ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను మరో చోటికి తరలిస్తే ఊరుకునేది లేదని అన్నారు. ఇంటిగ్రేటెడ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం పేరుతో పటాన్‌చెరులోని కర్ధనూర్‌కు తరలించేందుకు

09 లో

## దోచుకుంటున్న కార్పోరేట్ స్కూళ్లు

- తాను విద్యామంత్రి అయితే వాటిని మూయించేస్తా
- నల్లగొండలో ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ స్కూలు నిర్మాణం
- 8కోట్లతో అత్యాధునికంగా నిర్మించామన్న కోమటిరెడ్డి



నల్లగొండ, నేటిధాత్రి:
కార్పొరేట్ స్కూళ్లలో అధిక ఫీజులతో ప్రజలను దోచుకుంటున్నారని.. తాను విద్యాశాఖ మంత్రి అయితే అలాంటి స్కూళ్లను మూసివేయిస్తానని మంత్రి కోమటి రెడ్డి వెంకట్

06 లో

# మొదటి దయ్యం అతనే

- అతనే గుంపు మేస్త్రీ రేవంత్‌కు గూఢచారి
- కేసీఆర్ ఎన్ని ఇడ్లీ తిన్నాడన్నది చేరవేసే ఏజెంట్
- మాజీ ఎంపి సంతోష్ రావుపై మండిపడ్డ కవిత



హైదరాబాద్, నేటిధాత్రి:
తాను చెప్పిన మొదటి దయ్యం సంతోష్ రావేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఉద్యమకారులకు ఉద్యమ నాయకుడిని దూరం చేసింది అతనేనని కవిత ఘాటుగా విమర్శించారు. గద్దర్ లాంటి నాయకులు గేటు బయట ఉండాల్సి వచ్చిందంటే దానికి కారణం ఆయనేనని ఆరోపించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన కామెంట్స్ చేశారు. సంతోష్ రావుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కేసీఆర్ దగ్గర

09 లో

# రైతులకు అరకొర సాయం

- సకాలంలో చెల్లించని బోనస్
- ఆరు గ్యారెంటీలు... అసలు గ్యారెంటీలు పోయాయి
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వేముల





నిజామాబాద్, నేటిధాత్రి:
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అసెంబ్లీ ఎన్నికల్లో అనేక హామీలు గుప్పించి, ప్రజలను మోసం చేసిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు ప్రధానంగా పెట్టుబడి సాయం రూ.15వేలు, రైతుబీమా, రూ.2లక్షల్లోపు రుణమాఫీ, సకాలంలో ఎరువులు, విత్తనాలు, సాగుకు ఉచిత విద్యుత్, సాగు నీరు, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు వంటివి అనేక హామీలను ఎగవేశారని అన్నారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతులను ప్రోత్సహించేందుకు పంట

04 లో



## టిడిపిలో కార్యకర్తలే అధినేతలు

- యువతకు పార్టీలో సముచిత స్థానం
- అన్ని పదవుల్లో సామాజిక న్యాయసూత్రం
- పార్లమెంటరీ కమిటీ శిక్షణ తరగతుల్లో లోకేశ్



అమరావతి, నేటిధాత్రి:
టీడీపీలో కార్యకర్తలే అధినేతలుగా ఉంటారని, పార్టీలో యువతకు తగిన అవకాశాలు

04 లో

## యువగళం పాదయాత్రకు మూడేళ్లు పూర్తి

- లోకేశ్‌కు అభినందనలు తెలిపిన మంత్రులు, పార్టీ నేతలు
- పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు



అమరావతి, నేటిధాత్రి:
యువగళం పాదయాత్ర ప్రారంభించి మూడేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ

04 లో



## రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలి

- 16 ఏళ్ల లోపు యవతకు సోషల్ మీడియాను దూరం చేయాలి
- పొగాకుపై సెస్ బదులు జిఎస్టీతో తీవ్ర గందరగోళం
- అఖిలపక్ష భేటీలో టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్

04 లో

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో టీడీపీ పార్లమెంటరీ నేత లావు

FOLLOW US neti_dhatri WATCH US Netidhatri TV FOLLOW US netidhatri FOLLOW US Netidhatri News 28-01-2026 నేటిధాత్రి

# మేడారం కోసం మీడియా ఉత్సాహం

## దేశవిదేశాల నుంచి ఫోటోగ్రాఫర్లు, విలేకర్లు రాక



ములుగు, నేటిధాత్రి:
మేడారం జాతరలో మీడియా మేనేజ్‌మెంట్ అనేది అత్యంత ప్రధానమైనది, కీలకమైనది, సంక్లిష్టమైనది. అయితే సాంకేతికత పెరిగిన కారణంగా మీడియా కవరేజ్ చాలా సులువుగా మారింది. ఒక్క సెల్‌ఫోన్‌తో ప్రపంచ వ్యాప్తంగా సమాచారన్ని చేరవేసే అవకాశం రావడంతో జాతరలో ప్రత్యేకతలను విలేకరులు ఎప్పటికప్పుడు తమ కార్యాలయాలకు చేరవేస్తుంటారు. ఇంకా చెప్పాలంటే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విలేకర్లు పోటీపడి జాతరను కవర్ చేయడం చూస్తున్నాం. ఈ జాతర జరిగే నాలుగు ర ఓజులే కాకుండా నెల ముందునుంచి తరవాత ఓ పక్షం రోజుల వరకు నిరంతరం ప్రతి సూక్ష్మ అంశాన్ని ప్రజలకు తెలియజేస్తుంటారు. ఈ జాతర కవరేజీకి డీపీఆర్వో కార్యాలయం నుంచే దాదాపు వెయ్యి మీడియా పాస్‌లు జారీచేయడం, దానికితోడు మరో రెండు వందలకు పైగా దేశ, విదేశీ జర్నలిస్టులు కవరేజీ చేసేందుకు చేస్తారు. జాతరపై అధ్యయనం చేసేందుకు, జాతర అంశాలను తమ కెమెరాల్లో బంధించేందుకు ఎంతోమంది ఫోటోగ్రాఫర్లు కూడా వస్తారు. గిరిజన సంస్కృతీ, సాంప్రదాయాలు, మొక్కులు, జాతర జరిగే తీరు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే గిరిజన జాతుల సంస్కృతీ సంప్రదాయాలను తమ కథనాలతో పాటు, ఫోటోల ద్వారా అందించేందుకు ఉత్సాహం చూపుతారు.

# మహజాతరకు ఆర్టీసీ విస్తృతంగా ఏర్పాట్లు

## భక్తుల కోసం 4వేల ప్రత్యేక బస్సుల కేటాయింపు

ములుగు, నేటిధాత్రి:
మేడారం మహజాతరకు ఆర్టీసీ విస్తృతంగా ఏర్పాట్లు చేసింది. జాతరకు రాష్ట్ర నలుమూలల నుంచి 20 లక్షల మంది భక్తులను తరలించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. 4వేల ఆర్టీసీ బస్సులను సిద్ధం చేసింది. 10,441 మంది సిబ్బందిని నియమించి సేవలను విస్తృత పరిచేందుకు ఏర్పాట్లు చేసింది. వరంగల్ రీజియన్‌లో 51 పాయింట్లను ఏర్పాటు చేసింది. హన్మకొండలో హయగ్రీవచారి మైదానం, వరంగల్‌లో పండ్ల మార్కెట్‌లో మేడారం బస్సు పాయింట్స్‌ను ఏర్పాటు చేసింది. అలాగే జాతరకు వెళ్లలేని భక్తుల కోసం ఆర్టీసీ వినూత్న తరహాలో కొత్త స్కీం ప్రవేశ పెట్టింది. 30మంది భక్తులు ఉంటే ఇంటికే ఆర్టీసీ బస్సును వంపిస్తుంది. ఇప్పటికే మేడారం ప్రసాదాన్ని(బెల్లం) భక్తులకు ఇంటికి చేర్చేందుకు ప్రత్యేకంగా కార్గో సర్వీసు ప్రారంభించింది. అలాగే బస్సు సౌకర్యాలు, చార్జీలు, రూట్ మ్యాప్ తదితర వివరాల కోసం ప్రత్యేకంగా మేడారం విత్ ఆర్టీసీ పేరుతో ఓ యాప్‌ను రూపొందించింది. గత జాతరలో 3491 బస్సుల ద్వారా 16.82 లక్షల మంది ప్రయాణికులను చేరవేయగా, ప్రస్తుతం



20లక్షల మంది భక్తులను తరలించనున్నారు. వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాలతో పాటు హైదరాబాద్ రీజియన్ నుంచి బస్సులను కేటాయించారు. మేడారంలో 50 ఎకరాల్లో తాత్కాలిక బస్టాండ్‌ను ఏర్పాటు చేసి 9 కిలోమీటర్ల పొడవుతో 50క్యూలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒకేసారి 20వేల మంది భక్తులకు వసతి కల్పించనున్నారు. ప్రయాణికుల నిరీక్షణ, సిబ్బంది విశ్రాంతి గదులు, నిర్వహణ కార్యకలాపాల కోసం 1.10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు. వెయ్యి బస్సుల పార్కింగ్ కోసం మేడారంతో పాటు కామారంలో సౌకర్యాలు కల్పించారు. 7వేల మంది డ్రైవర్లు, 1811 మంది కండక్టర్లు, 759 మంది భద్రతా సిబ్బం ది, 153 మంది అధికారులతో కలిసి మొత్తం 10,441 మంది ఉద్యోగులకు విధులు కేటాయించారు. ట్రాఫిక్ జామ్ లాంటి సమస్యలు ఏర్పడకుండా పెట్రోలింగ్ పార్టీని సైతం నియమించారు.

# అందుబాటులో వాట్సాప్ సేవలు

## హెలికాప్టర్ ద్వారా జాయ్ రైడ్

ములుగు, నేటిధాత్రి:
జాతర సమాచారం కోసం తొలిసారి ప్రభుత్వం వాట్సాప్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. 76589 12300 నెంబర్‌కు హాయ్ అని మెసేజ్ పంపితే రూట్ మ్యాప్, ట్రాఫిక్ తదితర పూర్తి వివరాలు అందుతాయి. జాతరలో మొబైల్ నెట్ వర్క్‌కి అంతరాయం కలగకుండా 27శాశ్వత టవర్లు, 33తాత్కాలిక పద్ధతిలో టవర్లు, 450వెరీ హై ఫ్రీక్వెన్సీ సెల్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా 196ట్రాన్స్‌ఫార్మర్లు, 911విద్యుత్ స్థంబాలు, 65.75కి.మీ విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయగా, 350మంది విద్యుత్ సిబ్బందిని, 28డీజిల్ జనరేటర్లను అందుబాటులో ఉంచారు. జంపన్నవాగు వద్ద భక్తులకు స్నాన ఘట్టాలు, మహిళలు బట్టలు మార్చుకునేందుకు 119తాత్కాలిక గదులు, స్నానాలకు, తాగు నీటి కోసం బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ (బీవోటీ)లను ఏర్పాటు చేశారు. జంపన్నవాగులోకి లక్నవరం నుంచి నీటిని వదలటంతో పాటు మూడు ఫీట్లకు మించి ప్రవాహం లేకుండా ఇసుక చదును చేశారు. 210మంది గజ ఈతగాళ్లు, 12సింగరేణి రెస్క్యూ బృందాలు, 10 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను రంగంలోకి దించారు. 15ఫైర్ బ్రిగేడ్ వాహనాలు, 268 ట్రైలను అందుబాటులో ఉంచారు. జాతరలో మొత్తం 1,418ఎకరాల్లో 42 పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. మేడారం భక్తుల కోసం టూరిజం శాఖ హనుమకొండ నుంచి మేడారం వరకు హెలికాప్టర్ సేవలను ప్రవేశ పెట్టింది. అలాగే జాతరలో జాయ్ రైడ్ కోసం కూడా ఏర్పాట్లు చేసింది.

# మేడారంలో ముందస్తు మొక్కులు

## పక్షం రోజులుగా లక్షల్లో భక్తులు రాక

ములుగు, నేటిధాత్రి:
మేడారం వనదేవతలు సమ్మక్క- సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి మహా జాతరకు ముందుగా మొక్కులు చెల్లించుకున్నారు. ఎత్తుబంగారం(బెల్లం), పూలు, పండ్లు, చీరె, సారె, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించారు. యాట మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్న వాగులో పుణ్య స్నానాలు ఆచరించి, కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. ఇప్పటికే లక్షల్లో వచ్చి దర్శించుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాలతో వనదేవతల గద్దెలకు చేరుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ క్రమంలో మేడారం పరిసరాలన్నీ కిటకిటలాడాయి. గత పక్షం రోజులుగా లక్షల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవస్థానం అధికారులు, పోలీసులు అంచనాలు వేశారు. మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి ముందస్తుగా తరలివస్తున్న భక్తులకు దేవాదాయ శాఖ అధికారులు 24గంటలపాటు సమ్మక్క- సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు దేవతల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకునేలా ఏర్పాట్లు చేశారు. పగలు భక్తుల రద్దీ అధికంగా ఉంటున్న నేపథ్యంలో గద్దెల గేట్లకు తాళాలు వేస్తున్నారు. రాత్రిళ్లు మాత్రం భక్తుల తాకిడి తక్కువగా ఉంటుండడంతో గేట్లు తీసి నేరుగా తల్లుల గద్దెలను దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేశారు.

# రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలి



- 16 ఏళ్ల లోపు యవతకు సోషల్ మీడియాను దూరం చేయాలి
- పొగాకుపై సెస్ బదులు జీఎస్టీతో తీవ్ర గందరగోళం
- అఖిలపక్ష భేటీలో టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు డిమాండ్

న్యూఢిల్లీ, నేటిధాత్రి:
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించాలని ఢిల్లీలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో టీడీపీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రభుత్వాన్ని కోరారు. అఖిలపక్ష భేటీలో ఆయన టిడిపి పక్షాన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ ప్రయోజనాలతో పాటు దేశవ్యాప్త సమస్యలను లేవనెత్తినట్లు ఎంపీ తెలిపారు. సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భేటీలో ప్రధానంగా 16 ఏళ్లలోపు యువతకు సోషల్ మీడియా అందుబాటులో లేకుండా నిషేధించాలనే అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని కోరినట్లు తెలిపారు. పొగాకుపై సెస్ స్థానంలో జీఎస్టీ ప్రవేశపెట్టడం వల్ల చాలా గందరగోళ పరిస్థితి ఏర్పడిందన్నారు. పొగాకు వాణిజ్యం స్తంభించి పోయిందని.. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని తెలిపారు. ఈ అంశంపై చర్చ జరిగి సమస్య పరిష్కారం జరగాలని కోరానన్నారు. ఛార్జ్‌షీట్ నమోదైనా చాలా మంది క్రియాశీలక రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటున్నారని, ఈ అంశంపైనా పార్లమెంటులో చర్చ అవసరమని లేవనెత్తినట్టు ఎంపీ చెప్పారు. పూర్వోదయ పథకం కింద ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలను చేర్చినట్లే ఆంధ్రప్రదేశ్‌కూ ఈ పథకం వర్తింపజేయాలని.. దీనిపై చర్చ జరగాలని కోరినట్లు తెలిపారు. గతంలో జల్ జీవన్ మిషన్ కింద ఏపీకి 26 వేల కోట్లు మంజూరైనా.. రాష్ట్ర వాటా కింద నిధులు సమకూర్చాల్సి వస్తుందని, కేవలం రూ.2 వేల కోట్ల కేంద్ర నిధులు మాత్రమే వినియోగించుకున్నారని ఆయన విమర్శించారు. ప్రస్తుతం పెద్ద మొత్తంలో నిధులు సమకూర్చగలిగితే రాష్ట్రం వినియోగించుకునేందుకు సిద్ధంగా ఉందని, ఈ అంశంపై చర్చ జరగాలని ప్రతిపాదించామని లావు శ్రీకృష్ణదేరాయలు పేర్కొన్నారు. ఢిల్లీలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. రానున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో అఖిలపక్ష భేటీ నిర్వహించింది కేంద్రం. ఈ సమావేశానికి వివిధ పార్టీల లోక్‌సభ, రాజ్యసభ ఫ్లోర్ లీడర్లు హాజరయ్యారు. టీడీపీ పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు, వైసీపీ నుంచి మిథున్ రెడ్డి, పిల్లి సుభాశ్ చంద్రబోస్, బీఆర్ఎస్ నుంచి కేఆర్.సురేశ్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు.

### మేడారం వచ్చే భక్తుల కోసం

# రూట్ మ్యాప్

## వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం పోలీసుల గైడ్

ములుగు, నేటిధాత్రి:
ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఈ నెల 28 నుంచి 31వరకు జరగనున్న సమ్మక్క- సారలమ్మ మహా జాతరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం పోలీసులు ప్రత్యేక ర్యూట్ మ్యాప్‌ను రూపొందించారు. హైదరాబాద్, ఖమ్మం, నల్గొండ, జనగామ, వరంగల్ నుంచి ప్రైవేటు వాహనాల్లో వచ్చే భక్తులు వరంగల్ మీదుగా ములుగు, పస్రా, వెంగళాపూర్, నార్లాపూర్ మీదుగా మేడారంలో ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాలకు చేరుకునేలా ఏర్పాట్లు చేపట్టారు. వీరు తిరుగు ప్రయాణం నార్లాపూర్, బయ్యక్కపేట, కమలాపూర్ క్రాస్, భూపాలపల్లి మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఇక మహారాష్ట్ర, కాళేశ్వరం, భూపాలపల్లి, మంచిర్యాల, గోదావరిఖని, ఆదిలాబాద్, కరీంనగర్ నుంచి వచ్చే ప్రైవేటు వాహనాలు కమలాపూర్ క్రాస్ వద్ద నుంచి రాంపూర్, గొల్లబుద్దారం, బయ్యక్కపేట, నార్లాపూర్ మీదుగా మేడారం సమీపంలోని ఊరట్టం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల వరకు చేరుకోవాలి. వీరు తిరిగి అదే రూట్‌లో వెళ్లాల్సి ఉంటుంది. ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కొత్తగూడెం, భద్రాచలం, చర్ల, ఖమ్మం నుంచి వచ్చే ప్రయాణికులు ఏటూరునాగారం, చిన్నబోయినపల్లి మీదుగా ఊరట్టం పార్కింగ్ స్థలాలకు అనుమతించనున్నారు. వీరు తిరిగి ఇదే రూట్‌లో వెళ్లాల్సి ఉంటుంది. ఇక వీఐపీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు మేడారం వచ్చేందుకు తాడ్వాయి రూట్‌ను పోలీసులు ప్రత్యేకంగా కేటాయించారు. వీరు తిరిగి అదే దారిలో వచ్చి వెళ్లేలా ఏర్పాట్లు చేపట్టారు.

# మున్సిపల్ ఎన్నికల హడావిడి

- పనిలోపనిగా అక్రమార్కుల ఇసుకదోపిడీ
- అధికారులు పట్టించుకోవడంలేదంటున్న ప్రజలు



నిజామాబాద్, నేటిధాత్రి:
భీమ్‌గల్ మండలంలో ఇసుక దందాకు అడ్డూ అదుపులేకుండా ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. విడుతల వారీగా అడ్డాలు మారుస్తూ ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు. వీరికి నాయకులు, అధికార యంత్రాంగం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై గ్రామంలో కొందరు డయల్ 100 నంబర్‌కు ఫిర్యాదు చేయగా, పోలీసులు వచ్చి పరిశీలించి వెళ్లిపోయారు. మున్సిపల్ ఎన్నికల హడావుడిలో పార్టీలు, నాయకులు ఉండగా అక్రమార్కులు రహస్యంగా ఇసుకను తరలించడం చేస్తున్నారు. ఒక రోజు గ్యాప్ ఇచ్చి తిరిగి రాత్రి ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. అయినా అధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరించడం గమనార్హం. ఇటీవల గ్రామంలో ఉన్న కప్పల వాగు నుంచి ఇసుక తవ్వకాలకు అక్రమార్కులు స్థానిక గ్రామ కమిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం మూడు రోజుల క్రితం అర్ధరాత్రి పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లతో వాగులోకి ప్రవేశించి ఇసుకను గ్రామ శివారులోని హైస్కూల్ పక్కన డంపు చేశారు. అక్కడి నుంచి లారీలు, టారస్ బండ్లలో పట్టణ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అర్ధరాత్రి వేళ అందినకాడికి దోచుకుపోతున్నారు. అధికారంలోకి వచ్చిందే ఆలస్యం మండలంలోని కప్పలవాగుపై నాయకులు దండయాత్ర చేస్తున్నారు. మండలంలో ఇసుక లభించే ప్రాంతాలు కనిపిస్తే చాలు తవ్వుకుంటున్నారు. మొన్నటి వరకు బడాభీమ్‌గల్, తర్వాత భీమ్‌గల్, అనంతరం సికింద్రాపూర్, తాజాగా బెజ్జోరా వాగులో ఇసుక తవ్వకాలు చేపట్టిన అక్రమార్కులు ఇప్పుడు మండలంలోని గోన్‌గొప్పుల్ వాగులోకి ప్రవేశించారు. దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నీటి నిల్వలు తగ్గుతాయని అంటున్నారు. తంలో రెండు మూడు రోజులు పెద్ద మొత్తంలో ఇసుకను డంపులు చేసి ఒకేసారి లారీలు, టారస్ బండ్లలో పట్టణ ప్రాంతాలకు తరలించేవారు. భారీ ఇసుక డంపులతో ప్రజల కండ్లలోకి వస్తున్నామని భావించిన ఇసుకాసురులు, ఈ సారి కొత్త ఎత్తుగడ వేశారు. ముందుగానే నిర్ణయించిన స్థలంలో టారస్ బండ్లు, లారీలు సిద్ధంగా ఉంచి, వచ్చిన ఇసుకను వచ్చినట్లు జేసీబీ సాయంతో భారీ వాహనాల్లో నింపుతున్నారు. దీంతో తెల్లవారే సరికి ఖాళీ మైదానం దర్శనమిస్తుంది. ఎవరైనా దాడులు, తనిఖీలు చేసినా అక్కడ ఏమీ కనిపించకుండా ముందు జాగ్రత్త పడుతున్నారు. నియోజకవర్గ స్థాయిలో నాయకుల మద్దతుతోనే ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. గ్రామాలకు ఆదాయం ఆశ చూపించి, వీడీసీల పేరుతో గ్రామస్తుల నోరు నొక్కేస్తున్నారు. ఇసుక దోపిడీని అరికట్టి, సహజ వనరులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# వాహనాల ట్రాఫిక్ అతిపెద్ద సమస్య



- విధించిన రూట్లలోనే వెళ్లేలా చర్యలు
- రోడ్డు పక్కన వాహనాల నిలుపడం నిషేదం
- వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

వరంగల్, నేటిధాత్రి:
భక్తులు మేడారం జాతరకు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు చేపట్టినట్లు జాతర ట్రాఫిక్ ఇన్‌ఛార్జి, వరంగల్ పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. వాహనాలను నిరంతరంగా పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశామని అన్నారు. రోడ్డు పక్కల ఎక్కడా వాహనాల పార్కింగ్‌కు వీలులేదన్నారు. వివిధ రూట్లను సిద్ధం చేశామని, ఆయా రూట్లలోనే వాహనాలు వెళ్లేలా నిబంధనలు విధించామని అన్నారు. చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తుంటామని అన్నారు. 4,500 మంది పోలీసులను నియమించినట్లు పేర్కొన్నారు. మొత్తం 18 సెక్టార్లుగా విభజించామని, సెక్టార్‌కు డీఎస్పీ స్థాయి అధికారి పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఈ నెల 28 నుంచి మేడారం మహా జాతర ప్రారంభమవుతున్న సందర్భంగా జాతర ట్రాఫిక్ ఏర్పాట్లను వివరించారు. జాతరకు వెళ్లేందుకు ఒక దారి, తిరిగి వచ్చేందుకు మరో దారిని ఏర్పాటు చేశామని అన్నారు. తిరిగి వచ్చేప్పుడు నార్లపూర్, చలివాడు, రేగొండ, పరకాల, గుడెప్పాడ్, కరీంనగర్ వెళ్లే వాహనాలు పరకాల నుంచి పోవాల్సి ఉంటుందన్నారు. వివిధ మార్గాల ద్వారా వచ్చేవారికి మేడారం పరిసర ప్రాంతాల్లోనే పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని, సెక్టార్ల వారీగా పార్కింగ్ ఉంటుందని అన్నారు. ఒకటి నిండిన తర్వాత మరొకటి నింపుతారు. ఇలా పూర్తి స్థాయిలో వాహనాలను నిలిపిన తర్వాత ప్రత్యామ్నాయ మార్గాల్లో కూడా పార్కింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్, ఖమ్మం, మహబూబాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు ఓఆర్‌ఆర్ నుంచి దామెర మీదుగా వెళ్లాల్సి ఉంటుందని, నగరంలోకి వస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందని సూచించారు. వాహనదారులు జాతీయ రహదారులపై ఎట్టి పరిస్థితుల్లో వాహనాలను నిలుపవద్దని అన్నారు. పస్రా వరకు ఒకే మార్గంలో వెళ్లాల్సి ఉంటుంది. వీవీఐపీ, వీఐపీ పాస్‌లు ఉన్నవారికి మాత్రమే తాడ్వాయి నుంచి అనుమతి ఉంటుంది. మేడారంలో సూచించిన స్థలాల్లో మాత్రమే పార్కింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ట్రాఫిక్ సమస్యలు వస్తే జాతీయ రహదారిపై 35 హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేశాం. ట్రాఫిక్ ఎక్కడైనా నిలిచిపోతే వాహనాలను వెంటనే హోల్డింగ్ పాయింట్‌కు తరలించి క్లియర్ చేస్తాం. అధికారులు కూడా ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తారు.

# రైతులకు అరకొర సాయం



- సకాలంలో చెల్లించని బోనస్
- ఆరు గ్యారెంటీలు... అసలు గ్యారెంటీలు పోయాయి
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ వేముల

నిజామాబాద్, నేటిధాత్రి:
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అసెంబ్లీ ఎన్నికల్లో అనేక హామీలు గుప్పించి, ప్రజలను మోసం చేసిందని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. రైతులకు ప్రధానంగా పెట్టుబడి సాయం రూ.15వేలు, రైతుబీమా, రూ.2లక్షల్లోపు రుణమాఫీ, సకాలంలో ఎరువులు, విత్తనాలు, సాగుకు ఉచిత విద్యుత్, సాగు నీరు, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు వంటివి అనేక హామీలను ఎగవేశారని అన్నారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండించిన రైతులను ప్రోత్సహించేందుకు పంట ఉత్పత్తులకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ చెల్లిస్తామంటూ పీసీసీ చీఫ్ హోదాలో రేవంత్ రెడ్డి ప్రగల్భాలు పలికి మాటతప్పారని అన్నారు. ఆరు గ్యారెంటీలంటూ ఉన్న హామీలను కూడా పక్కన పెట్టారని అన్నారు. సన్న ధాన్యానికి మాత్రమే బోనస్ వర్తింపజేస్తామని అధికారంలోకి వచ్చాక మాట మార్చారని మండిపడ్డారు. ఆ తర్వాత సన్న వడ్లకు మాత్రమే ఇస్తామంటూ బుకాయించారు. సన్న వడ్లకు సైతం క్వింటాకు రూ.500 బోనస్ సరిగా అమలు కావడం లేదన్నారు. గత యాసంగిలో ధాన్యం అమ్ముకున్న రైతులకు బోనస్ జమ కాలేదు. యాసంగి, వానాకాలం సీజన్‌లు ముగిసి యాసంగి వచ్చినప్పటికీ బోనస్ బకాయిలు చెల్లింపుపై ప్రభుత్వం అశ్రద్ధ చూపుతోందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు దిక్కూ మొక్కూ లేకుండా పోయిందన్నారు. కేసీఆర్ పరిపాలనలో ఠంచనుగా అమలైన రైతు అనుకూల పథకాలన్నీ అతీగతీ లేకుండా పోతున్నాయన్నారు. అరకొరగా బోనస్ వర్తింపజేసి చేతులు దులుపుకున్న ఘటనలు కళ్ల ముందే సాక్షాత్కారమై నిలుస్తుండగా కాంగ్రెస్ పాలకుల్లో మాత్రం బాధ్యత కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రైతు డిక్లరేషన్‌లో పంటలకు బోనస్ కింద రూ.500 అందిస్తామని పేర్కొని సన్న వడ్లకు మాత్రమే పరిమితం చేసింది. ఇచ్చిన అబద్ధపు హామీని సైతం కాంగ్రెస్ పార్టీ సరైన రీతిలో అమలు చేయడం లేదని వేముల అన్నారు. గడిచిన నాలుగు సీజన్‌లలో బోనస్ చెల్లించిన పరిస్థితులు అరకొరగానే ఉన్నాయి. రైతులంతా ఆశగా బోనస్ కోసం ఎదురు చూస్తున్నారు. క్వింటా సన్న వడ్లకు రూ.500 చొప్పున బోనస్ వస్తే తమకు లాభం జరుగుతుందని సంబుర పడుతుంటే ప్రభుత్వం రైతుల ఆశలపై నీళ్లు చల్లుతోంది. అసంబద్ధమైన హామీలిచ్చి రైతులను ఆకర్షించిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడేమో పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మాట మార్చడంపై రైతులంతా ఆగ్రహంగా ఉన్నారని అన్నారు. వరి సాగు చేసే రైతులతో పాటుగా పసుపు, పత్తి, మొక్కజొన్న, అపరాల సాగు చేసే అన్నదాతలంతా బోనస్ ఇవ్వాలన్నారు. సాగులో ఇబ్బందులు, ఇతర పంటల్లో వెలుగు చూసే శ్రమను దృష్టిలో పెట్టుకుని అన్ని పంటలకు క్వింటాకు రూ.500 చొప్పున సాయం అందిస్తే రైతుకు ఉపకారం జరుగుతుందన్నారు. నిజామాబాద్ జిల్లాలో పసుపు సాగు సుమారుగా 25వేల ఎకరాల నుంచి 30వేల ఎకరాల్లో కొనసాగుతుంది. ఏటా జనవరిలో పసుపు పంట చేతికి వస్తుంది. ఈ సమయంలో పసుపు పంటకు కనీస మద్దతు ధర దక్కకపోవడంతో రైతన్నలకు నష్టాలు తప్పడం లేదు. పసుపు సాగు చేసే వారికి బోనస్ అందిస్తే రైతులకు ప్రోత్సాహకంగా ఉండటంతో పాటుగా పసుపు సాగు మరింత పెరిగే వీలుందని అన్నదాతలు చెబుతున్నారు.

# టిడిపిలో కార్యకర్తలే అధినేతలు



అమరావతి, నేటిధాత్రి:
టీడీపీలో కార్యకర్తలే అధినేతలుగా ఉంటారని, పార్టీలో యువతకు తగిన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్లమెంటరీ కమిటీల శిక్షణ తరగతుల కార్యక్రమంలో మంత్రి ప్రసంగించారు. అన్ని పదవుల్లో సామాజికన్యాయం చేయాల్సిన బాధ్యత పార్టీపై ఉందన్నారు. మహిళలను గౌరవించాలని, 33 శాతం పదవులు వారికి కేటాయించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం అన్నదాతకు అండగా నిలుస్తోందన్నారు. రైతులకు ఏ కష్టం వచ్చినా ముందుండి సహాయం అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. పార్టీ అంటే కమిట్మెంట్ ఉన్నవారికే కమిటీల్లో బాధ్యతలు అప్పగించామని, 83 శాతం మంది కొత్తవారికి పార్లమెంటరీ కమిటీల్లో చోటు కల్పించామని మంత్రి వెల్లడించారు. పార్టీనే అందరికీ అధినాయకత్వం అని పేర్కొన్న లోకేష్.. సేనాధిపతి చంద్రబాబుకి తామందరం సైనికులమని చెప్పుకొచ్చారు. మడమ తిప్పటం, మాట మార్చటం తెలుగుదేశం రక్తంలోనే లేదన్నారు. చేసిన పనులు చెప్పుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీలో మార్పులు తీసుకురావాలని, గ్రామ పార్టీ అధ్యక్షుడు పొలిట్ బ్యూరో స్థాయికి చేరేలా సంస్కరణలు చేపట్టామని తెలిపారు. కింది స్థాయి నుంచి పైస్థాయి వరకు యువతకు ప్రాధాన్యత అవసరమని చెప్పుకొచ్చారు. జనాభా దామాషా ప్రకారం అన్ని కులాలకు పదవుల్లో ప్రాధాన్యం ఇస్తున్నామని మంత్రి లోకేశ్ వివరించారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో పార్లమెంటరీ కమిటీలకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉదయం జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. ఉదయాన్నే ఎన్టీఆర్ భవన్‌కు చేరుకున్న లోకేశ్.. పార్లమెంటరీ కమిటీ సభ్యులను స్వయంగా ఆహ్వానించారు. ప్రతి సభ్యుడితో దాదాపు రెండు గంటల పాటు ఓపికగా ఫొటోలు దిగారు. ఆ తర్వాత ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు కూడా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్‌లు తదితర ప్రముఖ నేతలు పాల్గొన్నారు. మధ్యాహ్నం సచివాలయ కార్యక్రమాలను రద్దు చేసుకుని సీఎం చంద్రబాబు నాయుడు పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ లక్ష్యాలు, నాయకత్వ లక్షణాలు, తాజా రాజకీయ పరిణామాలపై సీనియర్ నేతలు క్లాసులు నిర్వహించనున్నారు. సాయంత్రం వరకు పార్టీ సీనియర్ నేతలు పార్లమెంటరీ కమిటీలకు శిక్షణ ఇవ్వనున్నారు. ముగింపు సమావేశంలో కమిటీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేయనున్నారు.

# యువగళం పాదయాత్రకు మూడేళ్లు పూర్తి

- లోకేశ్‌కు అభినందనలు తెలిపిన మంత్రులు, పార్టీ నేతలు
- పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు

అమరావతి, నేటిధాత్రి:
యువగళం పాదయాత్ర ప్రారంభించి మూడేళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ నేతలు ఘనంగా సంబరాలు చేసుకున్నారు. మంగళవారం ఉదయం పార్టీ కార్యాలయానికి చేరుకున్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ నేతలు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలిపారు. యువగళం పాదయాత్ర మూడేళ్ల సందర్భాన్ని గుర్తుచేస్తూ లోకేశ్‌తో కేక్ కట్ చేయించి సంబరాలు చేసుకున్నారు. ఏపీ రాజకీయాల్లో యువగళం పాదయాత్ర గేమ్ ఛేంజర్‌గా నిలిచిందని ఆ పార్టీ నేతలు కొనియాడారు. రాష్ట్రంలో కోట్లాది మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ ప్రజా చైతన్యమే లక్ష్యంగా యువగళం సాగిందని గుర్తుచేసుకున్నారు. 2023 జనవరి 27న కుప్పంలోని శ్రీ వరదరాజస్వామి పాదాల చెంత ప్రారంభమైన యువగళం పాదయాత్ర.. 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజకవర్గాలు, 232 మున్సిపాలిటీలు/ మండలాలు, 2,097 గ్రామాల మీదుగా 226 రోజుల పాటు 3,132 కిలోమీటర్ల మేర కొనసాగింది. లోకేశ్ పాదయాత్ర నిర్వహించిన 97 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడం ఈ యాత్ర విజయానికి నిదర్శనంగా నిలిచింది. లోకేశ్‌కు రాష్ట్ర పార్టీ అధ్యక్షుల్లు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, సోమిరెడ్డి, యార్లగడ్డ వెంకట్రావు, ఉగ్ర నరసింహారెడ్డి, గణబాబు, ఆదిరెడ్డి వాసు, ఎంఎస్ రాజు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి, వేపాడ, గ్రీష్మ, కార్పొరేషన్ ఛైర్మన్లు,



తదితరులు అభినందనలు తెలియజేశారు. పార్టీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో లోకేశ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు మహిళా మంత్రులు అనిత, సవిత. ఈ సందర్భంగా పాదయాత్ర ప్రారంభం నాటి స్మృతులను నేతలు గుర్తుచేసుకున్నారు. నేడు ప్రజలు సంతోషంగా, ప్రశాంతంగా ఉండటానికి యువగళం పాదయాత్రది ప్రధాన పాత్ర అని మంత్రులు అన్నారు. ఎన్నో నిర్బంధాలు, ఆటంకాలను తట్టుకుంటూ, ప్రభుత్వ అవమానాలను భరిస్తూ.. ప్రజల కోసం నాడు లోకేశ్ పాదయాత్ర కొనసాగించారని తెలిపారు. నేడు తమకు పదవులు వచ్చాయంటే అందుకు కారణం కూడా యువగళం పాదయాత్రే అని మంత్రులు వెల్లడించారు.

# 14 ఏళ్ల బాలుడు రాజ్యాంగం చేతపట్టుకొని ప్రశ్నిస్తున్న అశ్వమిత్ గౌతం




**భూపాలపల్లి,నేటిధాత్రి:**సిపిఐ ఎంఎల్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూభారతీయ జనతా పార్టీ అధికారంలో ఉన్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం 14 ఏళ్ల కుర్రాడి ప్రశ్నలకు భయపడుతోందా? ప్రశ్న అడగడం నేరమైపోయిన రోజుల్లోనిజం మాట్లాడటం తిరుగుబాటుగా మారిన కాలంలోఒక 14 ఏళ్ల బాలుడు రాజ్యాంగం చేత పట్టుకునివ్యవస్థనే నిలదీస్తున్నాడు! మోడీ, యోగి సర్కార్ జవాబు చెప్పలేక పోతుందా? ఆటబొమ్మలు చేతిలో ఉండాల్సిన వయసులోఅతని చేతిలో ఉంది అంబేడ్కర్ పుస్తకం.కార్టూన్లు చూడాల్సిన కళ్లలో కనిపిస్తున్నాయి సమాజంలోని అసమానతలు. అతడి పేరు అశ్వమిత్ గౌతం. లక్నోకు చెందిన ఒక సాధారణ బాలుడు.కానీ అతని ఆలోచనలు మాత్రంసాధారణ వ్యవస్థలకు అస్సలు నచ్చని అసాధారణమైనవి.చేతిలో తుపాకీ లేదు. గొంతులో విద్వేషం లేదు.నోట్లో బూతులు లేవు. కానీ అతని దగ్గర ఉందిఒక అత్యంత ప్రమాదకరమైన ఆయుధం --ప్రశ్న.తన యూట్యూబ్ ఛానెల్ద్వారారాజ్యాంగం ఏమంటుందో చెబుతున్నాడు.హక్కులు అంటే ఏమిటో వివరిస్తున్నాడు.చరిత్రను వర్తమానంతో పోలుస్తున్నాడు."ఎందుకు ఇలా జరుగుతోంది?" అని నిలదీస్తున్నాడు.అంతే... దోపిడి చేసే, పెట్టుబడి దారుల కొమ్ము కాసేవ్యవస్థ ఉలిక్కిపడింది. ప్రభుత్వానికి నిద్రపట్టలేదు.చిన్నోడిని చర్చించాల్సింది పోయి చట్టంతో బెదిరించాలనుకుంది. ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.ఇదేనా ప్రజాస్వామ్యం? ప్రశ్న అడిగితే కేసులు?ఆలోచిస్తే నేరం? చదివితే ప్రమాదం?ఈ దేశంలో లక్షల మంది ఇన్?ఫ్లుయెన్సర్లుకులాల గొప్పలు చెబుతూ బూతులు తిడుతూవ్యవస్థకు భజన చేస్తూ మిలియన్ల వ్యూస్ సంపాదిస్తారు. వాళ్లకు అవార్డులు. వాళ్లకు గుర్తింపు. వాళ్లకు ప్రోత్సాహం. కానీఒక పేద బాలుడు నిజం మాట్లాడితేమాత్రం అతనిపై కేసులు. అతనికి విచారణ. అతనిని భయపెట్టే వ్యవస్థ.ఇది న్యాయమా? లేదా ఇది భయపడే పాలనా?అశ్వమిత్ ఎక్కడా ద్వేష ప్రసంగం చేయలేదు.ఎవరినీ రెచ్చగొట్టలేదు. కేవలం పుస్తకాలలో ఉన్న మాటలే చెప్పాడు.రాజ్యాంగంలో ఉన్న హక్కులే గుర్తు చేశాడు. అంతే. అదే అతడు చేసిన "నేరం".భగత్ సింగ్ తుపాకీతో లేదు. అంబేడ్కర్ ఖడ్గంతో లేదు. కలాం బాంబులతో లేదు.వాళ్లందరికీ ఉన్నది ఒక్కటే -- ఆలోచన.ఈ రోజు ఆ ఆలోచన రూపమే అశ్వమిత్.భయపెడితే ఆలోచనలు ఆగవు. కేసులు పెట్టితే ప్రశ్నలు చనిపోవు. ఎంత నొక్కితే అంతే బలంగాధిక్కారపు మొక్క మొలుస్తుంది.అశ్వమిత్ గౌతం ఒక వ్యక్తి కాదు.ఒక ప్రజాస్వామ్య పరిరక్షణ వాద సంకేతంపేద వర్గాల చైతన్యానికి ప్రతిరూపం.రాబోయే తరాల ప్రశ్నల స్వరం.అతని గొంతుకు అండగా నిలబడటం అంటేఒక బాలుడిని కాపాడటం కాదు.రాజ్యాంగాన్ని కాపాడటం. ప్రజాస్వామ్యాన్ని కాపాడటం. మన భవిష్యత్తును కాపాడటం.ప్రశ్నలను అణచలేరు. ఆలోచనలనుఅరెస్ట్ చేయలేరు. నిజాన్ని ఎఫ్ఐఆర్ లో బంధించలేరు.అశ్వమిత్?తో పాటు నిలబడదాం.ఎందుకంటే ఈ రోజు అతడిని గొంతు నొక్కితేరేపు మన గొంతుక కూడా అదే చేతుల్లో ఉంటుంది....ప్రజలారా ప్రజాస్వామికవాదులారా, ఆలోచించండి.. అశ్వమిత్ గౌతమ్ పై అక్రమ కేసులను ఖండించండి.... ప్రజాస్వామ్యం కాపాడండి అని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా నాయకులు అంబాల అశ్వద్ధామ మారపల్లి రాజు ప్రజలకు విజ్ఞప్తి చేశారు

# సింగరేణి కార్మికుల సొంత ఇంటి కల నెరవేర్చేది ఎప్పుడు

**ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్**




**భూపాలపల్లి,నేటిధాత్రి:**సింగరేణి కార్మిక సమస్యలపై అనేకసార్లు ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా పలు మార్లు స్ట్రక్చర్ మీటింగ్ లో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన సమస్యలు పరిష్కరించడంలో యాజమా న్యం విఫల మైందని, కార్మిక సమస్యలను పరిష్కరించకుంటే సమ్మె కైనా సిద్ధమేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ యాజమాన్యాన్ని హెచ్చరించారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఏఐటియుసి కొమురయ్య భవన్లో రాజ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. కార్మిక సమస్యలపై అనేకసార్లు ఇన్కమ్ టాక్స్, మెడికల్ బోర్డు, సొంతింటి పథకం మారుపేర్ల, డిస్మిస్ కార్మికుల, మైనింగ్ స్టాఫ్ సమస్యలను పరిష్కరించాలని అనేక అంశాలపై స్ట్రక్చర్ మీటింగ్లలో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. ఇప్పటివరకు యాజమాన్యం స్ట్రక్చర్ మీటింగ్ అంగీకరించిన ఏ సమస్యను పరిష్కరించలేదని దాటవేసే ధోరణి అవలంబిస్తుందని మండిపడ్డారు. మెడికల్ బోర్డు నిర్వహణలో యాజమాన్యం పట్టింపు లేకుండా వ్యవహరిస్తుందన్నారు. అట్లాగే ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా అనేక అంశాలపై యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన కార్మికుల సొంతింటి పథకం అమలు చేయడంలో విఫలమైందన్నారు. అట్లాగే పెర్క్ పై ఇన్కమ్ టాక్స్ తగ్గించాలని, మైనింగ్ స్టాఫ్ సమస్యలు తోపాటు ఎన్నికల డ్యూటీలో విధులు నిర్వహించిన కార్మికుల ఆన్ డ్యూటీ గా పరిగణించాలని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లామని,వాటిని పెడచెవిన పెట్టిన యాజమాన్యం మొండి వైఖరిని నిరసిస్తూ ఫిబ్రవరి రెండో వారంలోపు సమస్యలు పరిష్కరించకుంటే సింగరేణిలో సమ్మె చేయడం తప్పదని రాజ్ మార్ హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేష్, ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి గురిచేపల్లి సుధాకర్ రెడ్డి, జి శ్రీనివాస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు

# సాతారం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థుల సామర్థ్యాలను మౌలిక వసతులను పరిశీలించిన నోడల్ ఆఫీసర్



**మల్లాపూర్,నేటిధాత్రి:**విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించుకునేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని జిల్లా తనిఖీ బృందం నోడల్ ఆఫీసర్ కొమ్మిడి లక్ష్మన్న సూచించారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాతారం లో విద్యార్థుల సామర్థ్యాలను జిల్లా ప్యానల్ తనిఖీ బృందం మంగళవారం పరిశీలించింది. పాఠశాలలోని మౌలిక వసతులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల రికార్డుల నిర్వహణ మార్కుల వివరాలను ఆన్లైన్లో నమోదు చేయడం తదితర అంశాలను పరిశీలించారు. తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధనా విధానాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కొమ్మిడి లక్ష్మన్న మాట్లాడుతూ విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు పెంపొందించుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు సమీపిస్తున్నందున ప్రత్యేకత తరగతుల నిర్వహిస్తూ స్లిప్ టెస్ట్ ద్వారా వారి సామర్థ్యాన్ని అంచనా వేసి ఫలితాల ఆధారంగా గ్రూపులుగా విభజించాలని పేర్కొన్నారు. విద్యార్థుల సామర్థ్యాల పెరుగుదలకు ప్రత్యేక చొరవ తీసుకొని ఉపాధ్యాయులు వారిని చదివించాలని చెప్పారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. పరీక్షలలో మంచి చేతిరాత నైపుణ్యాల యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ప్రతి విద్యార్థి పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, వారికి పాఠశాల అంటే ఆసక్తి కలిగేలా బోధన ఉండాలని దాని కొరకు ప్రత్యేక ప్రణాళికలు రచించాలని సూచించారు .పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించడం వల్ల రివిజన్ అవుతుందని తెలిపారు పాఠశాలలో తప్పక ల్యాబ్ నిర్వహించాలని సూచించారు విద్యార్థులు పఠనాసక్తి పెంపొందించడానికి గ్రంథాలయ నిర్వహణ కమిటీని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు .వారి స్థాయిని బట్టి పుస్తకాలను అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తనిఖీ బృంద సభ్యులు శ్రీనివాసరావు ,దాసరి రామస్వామి, ధర్మేందర్, శ్రీనివాస్ ,శ్రీధర్ ,రవీందర్, సంశుద్దీన్ ,లక్ష్మీనారాయణ నాయక్, మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం శ్రీహరి, ఉపాధ్యాయులు శేషగిరి ,శ్రీనివాస్, చంద్ర ప్రకాష్ ,హరికృష్ణ ,మల్లేశం అర్చన ,హరి శ్రీనిల్ ,ఎండి .కాజా మొయినుద్దీన్ ,డి చంద్రకళ ,గీత ,రాజేంద్రప్రసాద్ ,స్వామి ఉపాధ్యాయులు పాల్గొన్నారు

# మినీ మేడారం జాతరకు సర్వం సిద్ధం

**28 నుంచి 31 వరకు వనదేవతల మహాజాతర**



**నడికూడ,నేటిధాత్రి:** మండలంలోని కంఠాత్మకూర్ గ్రామ శివారులో గల శ్రీ సమ్మక్క -సారలమ్మ జాతరకు సర్వం సిద్ధం చేసాం,ఈ నెల 28 నుంచి 31 వ తేదీ వరకు జాతర నిర్వహిస్తారు,మేడారం తరువాత అత్యంత వైభవంగా జరిగే ఉమ్మడి వరంగల్ జిల్లాలో మూడో అతిపెద్ద జాతర కంఠాత్మకూర్ మినీ మేడారం జాతరకు లక్షల్లో భక్తులు వచ్చి వనదేవతలు అమ్మవార్లను దర్శించుకోవడం అనవాయితీ,జాతర ఆధునికరణ కోసం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, సర్పంచ్ కొంగంటి తిరుపతి కృషి,పట్టుదలతో జాతర ఏర్పాట్లకు కొన్ని మార్పులు చేర్పులు చేసాం గద్దెల చుట్టూ ఐరన్ పైపులు గ్రిల్స్, నూతన బోర్ లు ఏర్పాటు చేసాము,అంతే కాకుండా జాతర కమాన్ నుంచి గద్దెల వరకు మొరం పోయించి భక్తులకు రోడ్డు సౌకార్యం కల్పించాము,అంతే కాకుండా నిరంతరం విద్యుత్,త్రాగునీటి సౌకార్యం,స్థానాల గట్టాలు, మరుగుదొడ్లు,సౌండ్ సిస్టం, లైటింగ్,క్యూలైన్లు,మెడికల్ ఎమర్జెన్సీ,పోలీస్ బందోబస్తు, వాహనాల పార్కింగ్, జాతరకు మూడు కిలోమీటర్ల లోపు అన్ని వైపుల నుంచి ఆర్టీసీ బస్సు ఏర్పాట్లు,ఆటో రవాణా సౌకర్యం,అన్ని ఏర్పాట్లు పూర్తి చేసాం. భక్తులు ఉమ్మడి పరకాల మండలం వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో విచ్చేసి వనదేవతలు అమ్మవార్లను దర్శించుకుని మీ యొక్క కోరికలు నెరవేరాలని అమ్మవార్ల ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలని జాతర కమిటీ వైస్ చైర్మన్లు భాషిక శ్రీనివాస్,కుమ్మరి నరేష్ తెలిపారు.

# వనపర్తి లోమునిసిపల్ ఎన్నికల సందర్భంగా బీ ఆర్ ఎస్ బైక్ ర్యాలి

**మాజీ మంత్రి శాశన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్**



**వనపర్తి,నేటిధాత్రి:**మాజీ సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ శాసన మండలి మాజీ ఛైర్మెన్ కలిసి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రచారంలో భాగంగా వనపర్తి లో అంబేద్కర్ చౌరస్తా నుండి బీ ఆర్ ఎస్ కార్యకర్తలు బైక్ ర్యాలీ ప్రారంభించారు వార్డులో పర్యటించారు బైక్ ర్యాలీలో బి.ఆర్.ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారని జిల్లా మీడియా సెల్ ఇంచార్జి నంది మల్ల అశోక్ ఒక ప్రకటన లో తెలిపారుమాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రచార రథం నుండి ప్రజలకు అభివాదం చేస్తూ పలకరించారని అశోక తెలిపారు వనపర్తి పట్టణ మహిళలు,యువకులు,కార్మికులు,రైతులు ర్యాలీ ని చూసిన వారు వనపర్తి పట్టణ అభివృద్ధి రోడ్ల విస్తరణ సి సీ రోడ్లు డ్రైనేజ్ లు చెరువుల సుందరి కరణ మిషన్ భగీరథ పైపు లైను బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాములో జెరిగినాయని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అశోక్ తెలిపారు

# గుండి గ్రామాన్ని సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి వనం జగదీశ్వర్



**కరీంనగర్,నేటిధాత్రి:**కరీంనగర్ జిల్లా రామడుగు మండలంలో బుధవారం నుండి ప్రారంభం కానున్న సమ్మక్క జాతర ఏర్పాట్లను పరిశీలించి రామడుగు మండలంలో ప్రసిద్ధి చెందిన గుండి గ్రామంలోని సమ్మక్క జాతర విశేషాలను గ్రామస్థులను అడిగి తెలుసుకున్న అనంతరం గుడి ప్రాంగణంలో సమ్మక్క గద్దె వద్ద కొబ్బరికాయ కొట్టి పారిశుధ్య పనులను, జంపన్న వాగును పరిశీలించి లైటింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, జాతరకు వచ్చే భక్తుల కోసం తాగునీటి సదుపాయం ఏర్పాటు గురించి అడిగి తెలుసుకుని జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లను పూర్తి చేయాలనీ అధికారులను ఆదేశించారు. అనంతరం ఇటీవలే మరణించిన గ్రామ పంచాయతీ సఫాయి కార్మికులు పోచయ్య కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబంలో ఒకరిని గ్రామ పంచాయతీ ఉద్యోగం వచ్చేలా తగిన చర్యలు తీసుకుంటాం అని వారి కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి శ్రావణ్ కుమార్, గ్రామ సర్పంచ్ గుమ్మడి మల్లేశం, పంచాయతి కార్యదర్శి శ్రీనివాస్, వార్డు సభ్యులు, గౌడ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, గ్రామస్థులు, రామస్వామి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల మెరుపు దాడి




కమిషనరెట్అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల మెరుపు దాడి: ట్రాక్టర్ స్వాధీనం, డ్రైవర్ అరెస్ట్మందమర్రి పట్టణ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలపై పోలీసులు కొరాడ జులిపించారు. ఉదయం గవర్నమెంట్ జూనియర్ కాలేజీ సమీపంలో నిర్వహించిన తనిఖీల్లో భాగంగా, అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టర్?ను పోలీసులు పట్టుకున్నారు.కేసు వివరాలు:మందమర్రి మందమరి ఎస్సై నరేష్ గారి ఆదేశాల మేరకు ఏఎస్ఐ కె. మిలింద్ కుమార్ తన బృందంతో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, పాలవాగు (సండ్రన్?పల్లి) నుండి పట్టణం వైపు వస్తున్న ట్రాక్టర్?ను అనుమానంతో ఆపారు. వాహనాన్ని తనిఖీ చేయగా, ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు గుర్తించారు. నిందితుడి ఒప్పుకోలు:పోలీసుల అదుపులో ఉన్న డ్రైవర్ గట్టు మారుతి (సండ్రన్?పల్లి నివాసి) ని విచారించగా.. యజమాని కుమారుడు మ. రాజు ప్రోద్భలంతో, తక్కువ సమయంలో ఎక్కువ లాభం గడించడం కోసం దొంగ తనంగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు అంగీకరించాడు.

# మున్సిపల్ కోడ్ కూసింది ఆరేళ్ళ సందిగ్ధతకు తెరపడింది




**జహీరాబాద్,నేటిధాత్రి:**జహీరాబాద్: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలనగారా మోగింది. దీంతో ఎన్నికలపై జహీరాబాద్ ప్రజల్లో నెలకొన్న సందిగ్ధత తొలిగిపోయింది. మున్సిపాలిటీతో పాటు విలీన గ్రామాలతో కలిపి 37 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మొట్టమొదటిసారిగా మున్సిపల్ ఎన్నికల్లో పాల్గొంటున్న గ్రామ నేతలు, ప్రజలతో పాటు మున్సిపల్ వాసుల్లో కూడా ఆనందోత్సవం కనిపిస్తుంది.అధిక పోటీకౌన్సలర్ పదవికి పోటీ ఎక్కువ ఉ ండడంతో అభ్యర్థుల ఎంపిక పార్టీలకు తలనొప్పిగా మారింది. దాదాపు 6 సంవత్సరాల తర్వాత జరుగుతున్న ఎన్నికలు కావడంతో ఆశావహుల సంఖ్య పెరిగింది. మున్సిపాలిటీలోని 37 వార్డులకు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి సుమారు 200 పైగా అభ్యర్థులు పార్టీ టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 37 మందిని ఎంపిక చేసి బరిలో దింపాల్సి ఉంది. అయితే మిగతావారు రెబల్స్ గా బరిలో నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇదే జరిగితే ప్రధాన పార్టీల గెలుపోటములు రెబల్స్ పైన ఆధారపడి ఉంటుందన్న భయం పార్టీలను వెంటాడుతుంది.

# చట్ట ఉల్లంఘన తగదుఆతిథ్య ఉపన్యాసంలో స్పష్టీకరించిన డాక్టర్ అర్షియా సేథి





**పఠాన్చేరు,నేటిధాత్రి:**చట్టాలను మనం గౌరవిస్తే, అవి మనకు చట్టపరమైన రక్షణలను కల్పిస్తాయని, చట్ట ఉల్లంఘన తగదని ఫుల్ బ్రైట్ ఫెలో (రెండుసార్లు), విద్యావేత్త, కేఆర్ఐ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, అన్ మ్యూట్ సహ వ్యవస్థాపకురాలు డాక్టర్ అర్షియా సేథి స్పష్టీకరించారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ లోని లలిత, ప్రదర్శన కళలు విభాగం ఆధ్వర్యంలో 'మౌనాన్ని వీడడం: నేటి భారతదేశంలో కళలు, చట్టం' అనే అంశంపై ఆమె మంగళవారం ఆతిథ్య ఉపన్యాసం చేశారు.డాక్టర్ సేథీ మేధో సంపత్తి హక్కుల (ఐపీఆర్) గురించి సమగ్రమైన అవలోకనాన్ని అందించారు. ముఖ్యంగా సాహిత్య, సంగీత రచనలలో కాపీరైట్, భౌగోళిక సూచనలు (జీఐ), సంబంధిత మినహాయింపులపై దృష్టి సారించి, అనేక చారిత్రాత్మక న్యాయ కేసుల ద్వారా తన వాదనలను వినిపించారు. ఐపీఆర్ అనేవి పారిశ్రామిక, శాస్త్రీయ, సాహిత్య, కళా రంగాలలో మేధో కార్యకలాపాల నుంచి ఉత్పన్నమయ్యే సృజనలను రక్షించే చట్టపరమైన హక్కులని ఆమె వివరించారు. ఉద్యోగ కల్పన, ఆదాయ సృష్టి, ఆర్థిక వృద్ధిలో వాటి కీలక పాత్రను ఆమె విశదీకరించారు.డాక్టర్ సేథీ కాపీరైట్, ట్రేడ్ మార్కులు, సాహిత్య దొంగతనం, పైరసీ వంటి మేధో సంపత్తి హక్కుల ముఖ్య రూపాలను వివరించారు. అలాగే, ప్రింట్, కొత్త మీడియా, కళలు, ప్రసార మాధ్యమాలు, చలనచిత్రాలు, నాటక కళలు, సంగీతం వంటి రంగాలను స్పృజిస్తూ, 1957 కాపీరైట్ చట్టం, దాని 2012 సవరణల గురించి చెప్పారు. కాపీరైట్ ను 'హక్కుల సమూహం'గా ఆమె అభిర్ణించారు. ప్రచురించిన, ప్రచురించని అసలైన రచనలకు ఇది వర్తిస్తుందని, ఇందులో సానుకూల, ప్రతికూల హక్కులుంటాయని చెప్పారు. కష్టం, సృజనాత్మకత సూత్రాలతో పాటు వాస్తవికత యొక్క పరీక్షలను ఆమె వివరించారు.కళా సంప్రదాయాలలో గురువుల హక్కులను, రచనలు గౌరవం పొందుతున్నప్పటికీ, ఏ వ్యక్తి కూడా ఒక కళారూపంపై గుత్తాధిపత్యాన్ని హక్కును కోరలేరని డాక్టర్ సేథీ స్పష్టీకరించారు. కాపీరైట్ కు మినహాయింపులను వివరిస్తూ, కళాకారుల నైతిక హక్కులు, క్రియేటివ్ కామన్స్, సక్రమ వినియోగం, కాపీరైట్ గడువు తీరిపోవడం వంటి అంశాలను డాక్టర్ సేథీ చర్చించారు.తొలుత, కార్యక్రమ సమన్వయకర్త వైష్ణవి అతిథిని స్వాగతించి, సభికులకు పరిచయం చేశారు. లలిత, ప్రదర్శన కళల విభాగానికి చెందిన డాక్టర్ లలిత సింధూరి, డాక్టర్ ఆదిశేషయ్య అతిథిని జ్ఞాపికతో సత్కరించారు.

# డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

**ఐదు కోట్ల 65 లక్షల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి...పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి**



**పఠాన్చేరు,నేటిధాత్రి:**సంగారెడ్డి జిల్లా పటాన్చెరు నియోజకవర్గం భారతి నగర్, రామచంద్రాపురం డివిజన్ల పరిధిలో 5 కోట్ల 65 లక్షల రూపాయలు అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పటాన్చెరు శాసన సభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి గారు. బల్దియా పరిధిలోని డివిజన్ల అభివృద్ధికి సంపూర్ణ సహకార అందిస్తున్నామని తెలిపారు. హాజరైన స్థానిక కార్పొరేటర్లు సింధు ఆదర్శ్ రెడ్డి, పుష్ప నగేష్, అమీన్పూర్ డిప్యూటీ కమిషనర్ ప్రదీప్ కుమార్, డిఈ వెంకటరమణ, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు పరమేష్ యాదవ్, ఐలేష్ యాదవ్, ప్రమోద్ గౌడ్, ఆయా కాలనీల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# తహసీల్దార్ ను సన్మానించిన నాయకులు



**నడికూడ,నేటిధాత్రి:**గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నడికూడ మండల తహసీల్దార్ రాణి ఉత్తమ ఎమ్మార్వో అవార్డు ను కలెక్టర్ స్నేహ శబరిష్ చేతుల మీదుగా అందుకున్నారు ఎమ్మార్వో ను మండలంలోని కౌకొండ గ్రామానికి చెందిన నాయకులు శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిలో భాగంగా మరెన్నో సేవలందించి ఎన్నో ప్రశంస పత్రాలు పొందాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీపసర్పంచ్ బారాస నాయకులు పూరెళ్ల భాస్కర్, మేకల రఘుపతి కాంగ్రెస్ నాయకులు,కొమ్ము అఖిల్ పాల్గొన్నారు.



# నేటిధాత్రి 9 NETI DHATHRI

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా
"నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ లో పనిచేయుటకు

## ఆసక్తి కలిగిన కెమెరామెన్లు, రిపోర్టర్లకు

# ఆహ్వానం




పత్రికా రంగంలో "23 వసంతాల" అనుభవం
కలిగిన "నేటిధాత్రి" తెలుగు వార్త పత్రిక ఆధ్వర్యంలో
ఇప్పుడు "నేటిధాత్రి 9" యూట్యూబ్ ఛానల్ని
"పాఠక దేవుళ్ళ కోసం" "శక్తి బ్రాడ్ కాస్టింగ్స్" ద్వారా
మీ ముందుకు తీసుకు వస్తున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాము.

## "నేటిధాత్రి" పత్రికను ఆదరించిన విధంగానే "నేటిధాత్రి 9" "యూట్యూబ్ ఛానల్" కూడా ఆదరిస్తారని కోరుకుంటూ....





మీ
**కట్టా శివ సుబ్రహ్మణ్యం**
సీఈఓ నేటిధాత్రి డిజిటల్ మీడియా
8520007444

మీ
**కట్టా రాఘవేందర్ రావ్**
సీఈఓ నేటిధాత్రి దినపత్రిక
8297779999

## సంప్రదించవలసిన చిరునామా..

Srinivasa Nilayam 3rd Floor UBI Colony Road no: 03
Near TV9 Office Banjara Hills Hyderabad Pin Code : 500034

# మధుమేహులకు అనువైన సమ్మర్ డ్రింక్స్ ఇవే..!

మార్చిలోనే భానుడి ప్రతాపంతో ఎండ తాకిడి మొదలైంది. మధ్యాహ్న సమయంలో బయటకు రావాలంటే ప్రజలు భయపడే పరిస్థితి. వేసవి తాపం తీర్చుకునేందుకు జనం పండ్ల రసాలు వంటివి తీసుకోవడం సహజం. అయితే మధుమేహులు తమ షుగర్ లెవెల్స్ పెంచని సమ్మర్ డ్రింక్స్‌ను ఎంచుకోవడం మేలు. ఎలాంటి పరిస్థితులోనూ పండ్ల నుంచి తీసిన రసాన్ని మధుమేహులు తీసుకోరాదని బెంగళూర్‌కు చెందిన డైటీషియన్ నిధి నిగం హెచ్చరిస్తున్నారు. ఫ్రూట్ జ్యూస్‌లో పండులో ఉన్నంత ఫైబర్ ఉండదని దీంతో వెనువెంటనే షుగర్ లెవెల్స్ పెరిగే ప్రమాదం ఉందని అన్నారు. అయితే ప్రత్యామ్నాయ సమ్మర్ పానీయాలతో మధుమేహులు తమ దాహార్తి తీర్చుకోవచ్చని సూచిస్తున్నారు.

డయాబెటిక్‌తో బాధపడేవారు వారి షుగర్ లెవెల్స్ పెరగకుండానే హైడ్రేట్‌గా ఉండేందుకు ఇంటి నుంచే కొన్ని సహజసిద్ధమైన, ఆరోగ్యకర కూలింగ్ డ్రింక్స్ తయారుచేసుకోవచ్చని డైటీషియన్ కవితా దేవ్‌గన్ చెబుతున్నారు. భోజనానికి ముందు ఈ సమ్మర్ డ్రింక్స్ తీసుకోవాలని న్యూట్రిషనిస్టులు సూచిస్తున్నారు. ఇక మధుమేహులకు అనువైన సమ్మర్ డ్రింక్స్‌ను పరిశీలిస్తే..



**సబ్జా సీడ్స్‌తో కొబ్బరి నీరు,చియా సీడ్ డ్రింక్,కోకుమ్ షర్బత్,మజ్జిగ, క్రాన్‌బెర్రీ జ్యూస్,వెజిటబుల్స్ జ్యూస్**

# స్ట్రాబెర్రీస్, ద్రాక్ష తినేముందు ఇలా చేయండి..!

స్ట్రాబెర్రీస్, ద్రాక్ష సీజన్ ప్రారంభం కావడంతో వీటిని చాలా మంది ఆస్వాదిస్తుంటారు. అయితే వీటిని తినే ముందు కొన్ని జాగ్రత్తలు పాటించాలని వీటిని సరైన రీతిలో శుభ్రం చేయకుండా తీసుకుంటే గొంతు నొప్పి సహా పలు ఇన్ఫెక్షన్లు వెంటాడతాయని ఆరోగ్య సంరక్షకులు చందర్ అస్రానీ చెబుతున్నారు.

ఈ పండ్లపై మిగిలిఉండే ఎరువులు, రసాయనాలను తొలగించేందుకు ఉప్పు నీటిలో 20 నిమిషాల పాటు నానబెట్టి ఆపై డ్రై క్లాత్‌తో తుడిచిన తర్వాతే వాటిని తీసుకోవాలని సూచిస్తున్నారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే అస్వస్థతకు లోనయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.



# సమతుల ఆహారమే.. మన ఆరోగ్యానికి హామీ

మన ఆరోగ్యానికి సమతుల ఆహారమే హామీ ఇస్తుంది. రోజువారీ భోజనంలో అన్నంతోపాటు ఐదు రకాల రంగురంగుల కూరగాయలను సమపాళ్లలో తీసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ఇలా చేస్తే తినే పళ్లాన్నే కాకుండా మన జీవితాన్నీ రంగులమయం చేసుకోవచ్చు, ఆరోగ్యంగా బతికేయొచ్చు.



**పాలకూర**

30 గ్రాములు తీసుకోవాలి. రోజువారీ విటమిన్ ఎ అవసరంలో 16 శాతం లభిస్తుంది. అలానే విటమిన్ కె 120 శాతం అందుతుంది. క్యాన్సర్ ముప్పును పాలకూర తగ్గిస్తుంది.



**క్యారట్లు**

128 గ్రాములు తీసుకోవాలి. వీటిలో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. రోజువారీగా అవసరమైన ఎ విటమిన్‌లో 119 శాతం దీన్నుంచి లభిస్తుంది. క్యాన్సర్ నివారణకు వీటిలో ఉండే బీటా కెరోటిన్ అనే యాంటీ ఆక్సిడెంట్ దోహదపడుతుంది.



**బ్రకోలిజి**

91 గ్రాముల బ్రకోలి నుంచి రోజువారీ విటమిన్ కె 77 శాతం లభిస్తుంది. విటమిన్ సి 90 శాతం అందుతుంది. అదనంగా ఫోలేట్, మాంగనీస్, పొటాషియం కూడా లభిస్తాయి. ఇది కూడా క్యాన్సర్ ముప్పును తగ్గిస్తుంది. గుండెజబ్బులకు సంబంధించిన ఇన్‌ఫ్లమేటరీ కారకాలను నియంత్రిస్తుంది.



**పచ్చి బటానీలు**

160 గ్రాముల బటానీల్లో 9 గ్రాముల ఫైబర్, 9 గ్రాముల ప్రొటీన్ ఉంటుంది. ఎ, సి, కె విటమిన్లు, రిబోఫ్లెవిన్, థయామిన్, నియాసిన్ లాంటి బి కాంప్లెక్స్ విటమిన్లు, ఫోలేట్ సమృద్ధిగా ఉంటాయి. జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి, ట్యూమర్ల ముప్పు తగ్గడానికి పచ్చి బటానీలు దోహదపడతాయి.

# వ్యాయామంతో తగ్గనున్న స్ట్రోక్ ముప్పు

మెదడుకు అకస్మాత్తుగా రక్త సరఫరాలో అడ్డంకులు ఏర్పడినప్పుడు స్ట్రోక్ ముప్పు తలెత్తుతుంది. రక్తసరఫరాలో బ్లాకేజ్ (ఇస్కిమిక్ స్ట్రోక్), బ్లీడింగ్ (హమరేజిక్ స్ట్రోక్) వంటి సమస్యలతో స్ట్రోక్ ముంచుకొస్తుంది. ఈ సందర్భాల్లో మెదడుకు ఆక్సిజన్, పోషకాల సరఫరా నిలిచిపోవడంతో మెదడు దెబ్బతినడం, మెదడు కణాలు దెబ్బతినడం జరుగుతుంది. స్ట్రోక్స్ ప్రాణాంతకమే కాకుండా దాని ప్రభావం మెదడు, శరీర అవయవాలపై తీవ్రంగా ఉంటుంది. ఇది స్ట్రోక్ ఎక్కడ తలెత్తింది, బ్రైన్ డ్యామేజ్ ఏ మేరకు జరిగిందనే దానిపై అది చూపే ప్రభావ తీవ్రత ఆధారపడి ఉంటుంది.

అయితే నిత్యం వ్యాయామం చేసేవారిలో అనేక ఆరోగ్య ప్రయోజనాలతో పాటు స్ట్రోక్ ముప్పును కూడా నివారించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రతిరోజూ వ్యాయామం చేయడం ద్వారా మెదడు సహా శరీర భాగాలన్నింటికీ రక్తసరఫరా మెరుగుపడుతుంది. నిత్య వ్యాయామంతో స్ట్రోక్ ముప్పును తగ్గించే కారకాలను పరిశీలిస్తే..



**వ్యాయామంతో గుండె ఆరోగ్యం మెరుగు**
**బరువు నియంత్రణ**
**బీపీ నియంత్రణ**
**అదుపులో మధుమేహం**
**కొలెస్ట్రాల్ బ్యాలెన్స్**
**రక్త సరఫరా మెరుగుదల**
**వాపు ప్రక్రియకు చెక్**
**ఒత్తిడి మటుమాయం**
**నూతన కణాలతో రక్తసరఫరా మెరుగుదల**

# ఈ డీటాక్స్ డ్రింక్స్‌తో అందం, ఆరోగ్యం సొంతం

ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉండాలని కోరుకోని వారంటూ ఉండరు. ఈ క్రమంలో డీటాక్స్ డ్రింక్స్‌కు విపరీతమైన ఆదరణ పెరుగుతోంది. ఆధునిక జీవనశైలిలో ఒత్తిడితో చిత్తయ్యే రోజుల్లో శరీరంలో పేరుకుపోయే వ్యర్ధాలను బయటకు పంపే ప్రక్రియ డీటాక్స్ డ్రింక్స్‌తో సాధ్యం కావడంతో వీటిని తీసుకునేందుకు పలువురు ఆసక్తి చేపుతున్నారు.

డీటాక్సిఫికేషన్ ప్రక్రియలో శరీరానికి సహకరించేందుకు మనం తీసుకునే ఆహారంలో మార్పులు తప్పనిసరని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. డీటాక్సిఫికేషన్ ప్రక్రియలో శరీరంలోని కీలక అవయవాలు శుభ్రం అవుతాయి. వందల ఏండ్లుగా డీటాక్సింగ్‌ను ఎందరో అనుసరిస్తున్నారని, ఇది ప్రాచీన థెరఫీ అని మ్యాగీ పనెల్ తన బుక్ ది డిటాక్స్ కుక్‌బుక్ అండ్ హెల్త్ ప్లాన్‌లో రాసుకొచ్చారు.

డీటాక్స్ జీర్ణ వ్యవస్థను శుభ్రం చేయడంతో పాటు శరీరం నుంచి వ్యర్ధ పదార్ధాలను విసర్జించడంలో సహకరిస్తుంది. ఈ క్రమంలో డీటాక్స్ డ్రింక్స్ ఆదరణ పొందుతున్నాయి. శరీరం నుంచి వ్యర్ధాలను తొలగించకుంటే అది కడుపుబ్బరం, గ్యాస్, తలనొప్పి, మలబద్ధకం, చర్మ సమస్యల వంటి పలు ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. రోజూ డీటాక్స్ డ్రింక్స్ తీసుకోవడం ద్వారా బరువు తగ్గడం, జీవ క్రియల వేగం పెరగడం, జీర్ణశక్తి మెరుగవడం వంటి ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయి. ఇక ప్రతిరోజూ మనం ఎలాంటి డీటాక్స్ డ్రింక్స్ తీసుకోవచ్చంటే..



**దానిమ్మ జ్యూస్,నిమ్మ, మింట్‌తో కొబ్బరి నీళ్లు,డీటాక్స్ పసుపు టీ,తేనె, నిమ్మ, అల్లం టీ ,ఆరెంజ్, క్యారెట్, అల్లం డీటాక్స్ డ్రింక్**
**లెమన్, మింట్ డ్రింక్,కీరా, మింట్ డ్రింక్,పింక్ సాల్ట్, అల్లం డీటాక్స్ వాటర్,జీరా వాటర్**

# ఈ ఆహారంతో ఫ్యాటీ లివర్ ముప్పునకు చెక్



ఆధునిక జీవనశైలితో మద్యం సేవించే వారితో పాటు మద్యం తీసుకోని వారిలోనూ (నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్) ఫ్యాటీ లివర్ సమస్య పెరుగుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. లివర్‌లో అధికంగా కొవ్వు పేరుకుపోవడం ద్వారా ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ పరిస్థితి నివారించడం, నియంత్రించడంలో ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది.

ఫ్యాటీ లివర్ వ్యాధి ముప్పును తగ్గించేందుకు ఆరోగ్యకర ఆహారాన్ని జీవనశైలిలో భాగం చేసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఆహారంలో ముఖ్యంగా పాలకూర వంటి యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సీ వంటి విటమిన్స్, మెగ్నీషియం వంటి మినరల్స్ అధికంగా ఉండే ఆకుకూరలు అధికంగా తీసుకోవాలి.

ఇవి లివర్‌లో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించడంతో పాటు శరీరంలో ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ను నియంత్రిస్తాయి. ఇక ఒమేగా 3 ఫ్యాటీ ఆమ్లాలు అధికంగా ఉండే సాల్మన్, మాకెరెల్, సార్డినెస్ వంటి ఫ్యాటీ ఫిష్‌లు లివర్‌లో ఫ్యాట్ లెవెల్స్, ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. ఒమెగా 3 ఆమ్లాలు గుండె ఆరోగ్యానికి కూడా మేలు చేస్తాయి. ఇక ఒలెరుపిన్ వంటి శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉండే ఎక్స్ట్రా వర్జిన్ ఆలివ్ ఆయిల్ కూడా లివర్ ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. ఇక ఈ పది ఆహారాలను డిన్నర్‌లో తీసుకోవడం ద్వారా ఫ్యాటీ లివర్‌ను నియంత్రించవచ్చు..

**ఆకుకూరలు ఫ్యాటీ ఫిష్ ఆలివ్ ఆయిల్ నట్స్, సీడ్స్ అవకాడో వెల్లుల్లి బెర్రీస్‌జి గ్రీన్ టీ పసుపు తృణధాన్యాలు**

# ఫోలేట్.. తీసుకుంటున్నారా?

ఫోలేట్‌ను విటమిన్ బి9 అని కూడా పిలుస్తారు. రోజువారీ పనులు, గర్భిణిగా ఉన్న సమయంలో పిండం అభివృద్ధిచెందడంలో, తల్లి రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయులు తగినమోతాదులో ఉండటంలో ఫోలేట్ కీలకపాత్ర పోషిస్తుంది. ఇది తక్కువగా ఉంటే నాడులకు సంబంధించిన రుగ్మతలు వస్తాయి. మెదడు పనితీరు మందగిస్తుంది. ఫోలేట్ వివిధ ఆహార పదార్థాల నుంచి సహజంగానే లభిస్తుంది. ఇక విటమిన్ సప్లిమెంట్లు, ఫోర్టిఫైడ్ ఆహారాల్లో మాత్రం దీన్ని ఫోలిక్ యాసిడ్ రూపంలో జతచేస్తారు. అయితే, సహజమైన ఫోలేట్‌లా కృత్రిమ ఫోలిక్ యాసిడ్ శరీరంలో కలిసిపోదని కొందరి అభిప్రాయం.

కాబట్టి మనం తినే ఆహారంలోనే ఫోలేట్ ఎక్కువగా ఉన్నవాటిని ఎంచుకోవడం మంచిది. పాలకూర, తోటకూర, అవకాడో, పచ్చిబటాణీలు, బ్రసెల్స్ స్ప్రౌట్స్, బ్రకోలి, ఆవకూర, టమాటాలు, నారింజ, పల్లీలు, అంగూర్లు, పొప్పడి, అరటి పండ్లు, పచ్చసొనతో కూడిన గుడ్లు, జంతు మాంసంలో తినదగిన అవయవాలు (ఆర్గాన్ మీట్స్)



మొదలైన వాటిలో ఫోలేట్ దొరుకుతుంది. అయితే సేంద్రియమైనవి, హానికరమైన పురుగుమందుల అవశేషాలు లేని పదార్థాలు ఎంచుకోవాల్సి ఉంటుంది.

